




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 357 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శనివారం 30 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :357 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SAT 30 AUGUST 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## జగన్.. ఇదే నా నువ్వు కట్టిన ప్యాలెస్



- రుషికొండ ప్యాలెస్ లో బెడ్ రూమ్‌లు, బాత్ రూమ్‌లు చూసి విస్తుపోయిన పవన్ కల్యాణ్
- విశాఖ పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- మంత్రులు, జనసేన ఎమ్మెల్యేలతో కలిసి రుషికొండ ప్యాలెస్ ను పరిశీలించిన వైనం
- ఈ ప్యాలెస్ పై అసెంబ్లీలో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్న పవన్

వివరాలు 2లో..

## రాష్ట్ర ప్రగతిలో సీఏలు మార్గదర్శకులు కావాలి

- 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమన్న మంత్రి
- రాష్ట్ర అభివృద్ధిలో చార్టర్డ్ అకౌంటెంట్లు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని వ్యాఖ్య
- ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణకే కట్టుబడి ఉన్నామన్న లోకేశ్
- భోగాపురం ఎయిర్‌పోర్ట్‌తో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారతాయని వెల్లడి
- విశాఖకు గూగుల్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థలు వస్తున్నాయన్న మంత్రి



పెన్ పవర్ డెస్క్:2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఈ బృహత్తర ప్రయాణంలో చార్టర్డ్ అకౌంటెంట్లు (సీఏలు) కేవలం భాగస్వాములుగా కాకుండా మార్గదర్శకులుగా నిలవాలని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) నిర్వహించిన 'అర్థసమృద్ధి - 2025' సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని

వివరాలు 2లో..



## జపాన్, భారత్ కలిస్తే అద్భుతాలే

- టోక్యోలో ఇండియా-జపాన్ ఎకనామిక్ ఫోరంలో ప్రధాని మోదీ ప్రసంగం
- ప్రపంచమంతా ఇప్పుడు భారత్ వైపే చూస్తోందన్న ప్రధాని
- త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని ధీమా

పెన్ పవర్ డెస్క్:భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచ దేశాలు కేవలం మన వృద్ధిని గమనించడమే కాకుండా మనపై గట్టి నమ్మకంతో ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. త్వరలోనే భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జపాన్ పర్యటనలో ఉన్న మోదీ... టోక్యోలో జరిగిన ఇండియా-జపాన్ ఎకనామిక్ ఫోరంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "ప్రస్తుతం భారతదేశంలో రాజకీయ స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం, పారదర్శక విధానాలు ఉన్నాయి. ప్రపంచంలోనే

వివరాలు 2లో..

## జీవనశైలితో ఫుడ్ ప్రాసెసింగ్‌కు ఏపీలో పెట్టుబడి అవకాశాలు!






- విశాఖలో ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సమ్మిట్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- వచ్చే ఐదేళ్లలో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడుల లక్ష్యం
- అమరావతిలో చాప్టర్ ఏర్పాటుపై ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రకటన

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాబోయే ఐదేళ్లలో ఈ రంగాల్లో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులను సాధిస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శుక్రవారం విశాఖలో ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సమ్మిట్‌కు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వ్యవసాయ, అనుబంధ రంగాలను లాభదాయకంగా, సుస్థిరంగా మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ఆహార శుద్ధి రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఈ పరిశ్రమ విలువ ప్రస్తుతం 8 ట్రిలియన్ డాలర్లుగా ఉందని, భారత్ కూడా 2030 నాటికి 700 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈ రంగంలో భారత్ మరింత వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఆహార శుద్ధిలో ఆంధ్రప్రదేశ్ 9 శాతం వాటాతో 50 బిలియన్ డాలర్ల విలువను కలిగి ఉందని అన్నారు. అలాగే జీఎస్డీపీలో వ్యవసాయం సహా అనుబంధ రంగాల వాటా 35 శాతంతో రూ.5.19 లక్షల కోట్లుగా ఉందన్నారు. త్వరలోనే ఏపీ ఫ్రూట్ కేపిటల్ ఆఫ్ ఇండియాగా అవతరిస్తుందని, దేశంలోని ఉత్పత్తిలో 25 శాతం వాటాకు చేరుకుంటామని తెలిపారు. అదేవిధంగా 2.26 లక్షల హెక్టార్లలో ఆక్వా కల్చర్ సాగు చేస్తున్న ఆంధ్రప్రదేశ్

వివరాలు 2లో..

## రుషికొండ భవనాల వినియోగంపై ఏపీ ప్రభుత్వం దృష్టి

- భవనాలను ఎలా వినియోగించుకోవాలనే అంశంపై కసరత్తు
- అధ్యయనం చేసేందుకు ముగ్గురు మంత్రులతో కమిటీ ఏర్పాటు
- సరైన విధంగా వినియోగించే మార్గాలపై అధ్యయనం చేసి సిఫార్సులు చేయాలని సూచన



పెన్ పవర్ డెస్క్:రుషికొండలో గత ప్రభుత్వం నిర్మించిన భవనాలను ఏ విధంగా వినియోగించాలనే అంశంపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. భవనాల వినియోగంపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ముగ్గురు మంత్రులతో కూడిన

వివరాలు 2లో..



## జగన్ కోసమే మోదీ సీబీఐ గొంతు నొక్కారు

- వివేకా హత్య కేసుపై వైఎస్ షర్మిల సంచలన వ్యాఖ్యలు
- మోదీకి జగన్ దత్తపుత్రుడంటూ తీవ్ర విమర్శలు
- అన్ని ఆధారాలున్నా దోషులకు శిక్ష పడటం లేదని ఆవేదన

పెన్ పవర్ డెస్క్:తన చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకా నంద రెడ్డి హత్య కేసు విషయంలో ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్

వివరాలు 2లో..

## తాడిపత్రికి వెళ్లేందుకు తొలగిన అడ్డంకులు.. పెద్దారెడ్డికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

- తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట
- తాడిపత్రిలోకి ప్రవేశించకుండా గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే
- కేతిరెడ్డికి భద్రత కల్పించాలని ఏపీ పోలీసులను ఆదేశించిన సర్వోన్నత న్యాయస్థానం



వివరాలు 2లో..

## ఐఏఎస్ అధికారిణి చీరలు, విగ్గుల గురించి మాట్లాడటం సిగ్గుచేటు

- రాజశేఖరరెడ్డి కోసం జైలుకు వెళ్లిన అధికారిణిని విమర్శిస్తారా? అని చింతా మోహన్ మండిపాటు
- అక్రమాల కోసం ఆమెను వాడుకున్నారని ఆరోపణ
- వ్యక్తిగతంగా దూషించడం సరికాదని హితవు

వివరాలు 2లో..





## బీసీసీఐ అధ్యక్ష పదవికి రోజర్ బిన్నీ రాజీనామా..

### తాత్కాలిక ప్రెసిడెంట్‌గా రాజీవ్ శుక్లా!

- బీసీసీఐ అధ్యక్ష పదవి నుంచి రోజర్ బిన్నీ ఔట్
- తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రాజీవ్ శుక్లా
- సెప్టెంబర్‌లో జరగనున్న బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం, ఎన్నికలు
- టీమిండియా కొత్త స్పాన్సర్ కోసం బీసీసీఐ తీవ్ర ప్రయత్నాలు
- పాత నిబంధనల ప్రకారమే జరగనున్న సెప్టెంబర్ ఎన్నికలు

పెన్ పవర్ డెస్క్:బీసీసీఐలో అనూహ్య పరిణామం చోటుచేసు కుంది. ప్రస్తుత అధ్యక్షుడు రోజర్ బిన్నీ తన పదవి నుంచి తప్పుకున్నారు. ఆయన స్థానంలో

వివరాలు 2లో..

## రామసేతుకు జాతీయ హెూదా కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు




- రామసేతుకు జాతీయ హెూదాపై సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్
- విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు
- కేంద్ర సాంస్కృతిక శాఖ, పురావస్తు శాఖకు నోటీసులు
- తన విజ్ఞప్తిపై కేంద్రం నిర్ణయం తీసుకోవడం లేదని స్వామి ఆరోపణ
- గతంలో ఇచ్చిన ఆదేశాలను పాటించాలని పిటిషన్‌లో అభ్యర్థన
- నిర్ణీత సమయంలోగా దీనిపై తేల్చాలని కోర్టుకు విజ్ఞప్తి

వివరాలు 2లో..

## గణేష్ నిమజ్జనాలు షురూ.. ట్యాంక్ బండ్ దగ్గర ట్రాఫిక్ ఆంక్షలు




పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్ మహానగరంలో గణేష్ నిమజ్జనాలు షురూ అయ్యాయి. శుక్రవారం (ఆగస్టు29) ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో వినాయక నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. గణేష్ నిమజ్జనాల సందర్భంగా ఈ రోజునుంచి సెప్టెంబర్ 5 వరకు ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నిమజ్జనానికి వచ్చే విగ్రహాలను బట్టి ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా పీవీఎన్ఆర్ మార్గ్‌లలో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ నుంచి వచ్చే వాహనాలను కవాడిగూడ మీదుగా దారి మళ్లించారు. ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ స్టేడియం దగ్గర నిమజ్జనాల కోసం క్రేన్లను ఏర్పాటు చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎటువంటి

వివరాలు 2లో..

## పిన్నెల్లి సోదరులకు నిరాశ.. ముందస్తు బెయిల్ కు హైకోర్టు నిరాకరణ

- టీడీపీ నేతల జంట హత్యల కేసులో నిందితులు
- ఈ కేసులో అరెస్టు నుంచి రక్షణ కోసం కోర్టులో పిటిషన్
- విచారణ జరిపి పిన్నెల్లి సోదరుల పిటిషన్ ను తోసిపుచ్చిన హైకోర్టు




పెన్ పవర్ డెస్క్:టీడీపీ నేతల జంట హత్యల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పిన్నెల్లి సోదరులకు ఏపీ హైకోర్టు షాకిచ్చింది. ముందస్తు బెయిల్ కోసం వారు దాఖలు చేసిన పిటిషన్ ను ఈ రోజు తోసిపుచ్చింది. పల్నాడు జిల్లా మాచర్లలో సంచలనం సృష్టించిన టీడీపీ నాయకులు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావుల హత్య కేసులో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# మోడీ గ్రాఫ్ పెరుగుతోందా.. అదెలా అంటే ?

దేశంలో మూడు సార్లు వరసగా ప్రధానిగా ప్రమాణం చేసి కొత్త రికార్డుని నెలకొల్పారు నరేంద్ర మోడీ. పండిట్ నెహ్రూ తరువాత స్థానంలోకి ఆయన ఆ విధంగా వచ్చేశారు. మరోసారి ప్రధాని కావాలని కూడా ఆయన అభిమానులు కోరుకుంటున్నారు. అయితే 2024 ఎన్నికల ఫలితాలు మాత్రం బీజేపీని మోడీని కొంత నిరాశ పరచాయి. మోడీ నాయకత్వం వహించిన బీజేపీ ఫుల్ మెజారిటీకి దూరంగా నిలిచింది. కేవలం 240 ఎంపీ సీట్లు మాత్రమే సొంతంగా సాధించగలిగింది. అయితే పదిహేను నెలలు గిర్రున తిరగకుండానే దేశంలో రాజకీయం మారుతోందని అది మోడీకి అనుకూలంగా ఉందని తాజా అంచనాలు చెబుతున్నాయి.

**బలమైన నాయకుడిగా :**

మోడీకి 2014 నుంచి ఈ రోజు దాకా ఉన్న అతి పెద్ద ప్లస్ పాయింట్ ఏమిటి అంటే బలమైన నాయకుడు అని. ఆయన నాయకత్వం మీద జనాలకు ఆ విధంగా నమ్మకం అయితే ఉంది. ఇక దేశంలోనూ అంతర్జాతీయంగా జరుగుతున్న అనేక పరిణామాలను కూడా బేరీజు వేసుకున్న ప్రజలు ఈ కీలక సమయంలో ఆయన ఉండడమే సబబు అని భావిస్తున్నారు. భారత్ కి ఈ రోజు పక్కలో బల్లెంలా పాక్ తో పాటు బంగ్లాదేశ్ ఉంది. అలాగే చైనా కూడా భారత్ కి నమ్మదగిన నేస్తం కాదు. ఈ నేపథ్యంతో పాటు నిన్నటిదాకా మిత్రుడిగా ఉన్న అమెరికా ఈ రోజు శత్రువుగా మారి కాలు దువ్వుతోంది. ఈ నేపథ్యం నుంచి చూసినపుడు భారత్ కి ఇంటా బయటా సవాళ్ళు అనేకం ఉన్నాయి. ఈ క్లిష్ట పరిస్థితులలో నరేంద్ర మోడీ నాయకత్వం వీటికి సరైన జవాబు చెప్పగలదని అత్యధికుల విశ్వాసంగా కనిపిస్తోంది అంటున్నారు.

**సరిసాటి లేకుండా పోయారా :**

ఒకప్పుడు దేశ రాజకీయాల్లో ధీటైన నాయకులు ఎంతో మంది ఉండేవారు. కానీ రాను రానూ ఆ కొరత ఎక్కువగా కనిపిస్తోంది. ప్రజాకర్షణ కలిగిన నాయకత్వంతో పాటు అత్యధిక శాతం మంది మన్ననలు పొందే లీడర్లు అవసరం ఉంది ఇక ఒక్కసారి చూసుకుంటే కనుక గత పదకొండేళ్ళ నుంచి నరేంద్ర మోడీ దేశంలో ధీటైన నాయకుడిగా ఎదుగుతున్నారు. ఆయనకు సరిసాటిగా సమీపంలోకి కూడా వచ్చే వారు పెద్దగా కనిపించడం లేదు అని అంటున్నారు. బీజేపీలో కీలక నేతలు సీనియర్లు ఎంతో మంది ఉన్నా కూడా ఎవరికి వారుగా గొప్పవారే కానీ మోడీ స్థానాన్ని ఆయన స్థాయిని ఆక్రమించేవారు అయితే ప్రస్తుతానికి లేరని అంటున్నారు. ఇక బయట చూసినా విపక్షంలోనూ అదే కొరత ఉంది. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఇపుడిపుడే రాటు తేలుతున్నారు. ఆయనకు పాలనానుభవం అయితే లేదు. అదే విధంగా కాంగ్రెస్ కి మునుపటి ఆదరణ ఇంకా దక్కాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో వస్తున్న సర్వేలు కానీ అంచనాలు కానీ బీజేపీకి ఎక్కువ సీట్లు వస్తాయని చెబుతున్నాయి.

**సిద్ధాంత రాహిత్యం :**

ఇంకో వైపు చూస్తే దేశంలో సాగుతున్న రాజకీయాల్లో సిద్ధాంతాల కంటే రాద్ధాంతాల తం మీదనే పోరు ఎక్కువగా కనిపిస్తోంది. ఒకనాడు సిద్ధాంత పరంగా పార్టీల మధ్య సమరం సాగేది అది జనాలకు కూడా నచ్చేది కానీ ఇపుడు పూర్తిగా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. వ్యక్తిగత విమర్శలు ఎక్కువగా చేసుకుంటున్నారు. ఈ పరిణామాల వల్ల జనాలకు ఆయా పార్టీల పట్ల అంతగా మొగ్గు కనిపించేందుకు ఆస్కారం ఉండడం లేదని విశ్లేషణలు ఉన్నాయి.

**చట్ట సభలను వాడుకోవాలి :**

రాజకీయంగా పై చేయి సాధించాలంటే సిద్ధాంతపరమైన పోరాటం ఉండాలి. దానికి గానూ చట్ట సభలను ఎక్కువగా ఉపయోగించుకోవాలి. కానీ పార్లమెంట్ లో చూస్తే కనుక ప్రతీ సారీ వాయిదాల పర్వమే సాగుతోంది. ఒకే అంశం మీద మొత్తం సెషన్లు కొట్టుకుని పోతున్నాయి. దాని వల్ల అధికార పక్షానికి పోయేది ఏమీ లేకపోయినా విపక్షానికే రాజకీయంగా నష్టం వాటిల్లుతోంది. ఇవన్నీ కూడా ప్రజల మూడ్ ని కూడా తెలియచేస్తున్నాయి.

**మూడ్ ఆఫ్ ది నేషన్ ఇదేనా :**

ఇదిలా ఉంటే ఇండియా టుడే సీ ఓటర్ కలిసి చేసి మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో మరోసారి మోడీ నాయకత్వంలోని బీజేపీకి అవకాశాలు మెరుగు అవుతాయని తేలింది. 2024లో 240 ఎంపీ సీట్లు మాత్రమ సాధించిన బీజేపీ ఈ పదిహేను నెలల్లో మరో ఇరవై సీట్లను పెంచుకుని 260 కి ఎగబాకడం అంటే అది మోడీకి పెరిగిన గ్రాఫ్ గానే చూడాలని అంటున్నారు అదే సమయంలో ఎన్డీయే మిత్రులతో కలిపి ప్రస్తుతం 292 మంది ఎంపీలు మాత్రమే ఉన్నారు ఈ సంఖ్య ఇప్పటికిపుడు ఎన్నికలు జరిగితే ఏకంగా 324కి ఎగబాకుతుంది అని అంటున్నారు. అంటే ఇందులో బీజేపీకి పెరిగిన ఇరవై సీట్లు పోనూ మిత్రులు మరో పది సీట్లు ఎక్కువ సాధిస్తారు అని లెక్క తేల్చింది అన్న మాట. చూడాలి మరి ముందు ముందు మోడీ గ్రాఫ్ ఏ విధంగా ఉంటుందో.

## జీవనశైలితో ఫుడ్ ప్రాసెసింగ్‌కు

# ఏపీలో పెట్టుబడి అవకాశాలు!

- మొదటి పేజీ తరువాయి

దేశానికి ఆక్వా హబ్‌గా ఉందని స్పష్టం చేశారు.

**ఫుడ్ ప్రాసెసింగ్ లో అవకాశాలు- ప్రోత్సాహకాలు**

ఆంధ్రప్రదేశ్‌లో ఆహార శుద్ధి రంగంలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. విస్తృతమైన మౌలిక సదుపాయాలు కూడా ఆంధ్రప్రదేశ్ సొంతమని పెట్టుబడిదారులు, ఎగుమతిదారులకు వివరించారు. రాష్ట్రంలో 9 ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్కులు, 17 లక్షల మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్, 33 లక్షల టన్నుల సరకు నిల్వ చేసేందుకు గోదాములు ఉన్నాయని అన్నారు. ఆహారం, పానీయాల యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశాలు కల్పిస్తూ 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. చిత్తూరు, గుంటూరు, కోస్తాంధ్ర, విశాఖ జిల్లాల్లో పండ్లు, సుగంధ ద్రవ్యాలు, ఆక్వా, కోకో, కాఫీ క్లస్టర్లు ఉన్నాయని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, రూ.200 కోట్లకు పైగా పెట్టుబడులు దాటితే వాటిని మెగా ప్రాజెక్టులుగా పరిగణించి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని సీఎం వెల్లడించారు. గత ఏడాది రాష్ట్రానికి ఆహార శుద్ధి రంగంలో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు.

**ఆహారపు అలవాట్లు- మారుతున్న జీవన శైలితో పెట్టుబడులకు అవకాశాలు**

ప్రజల ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలితో ఆహార శుద్ధి రంగంలో అపారమైన అవకాశాలు వస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. పెట్టుబడులకు ఇదే సరైన సమయమని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ రంగంలో వచ్చే ఎంఎస్ఎంఈలను కూడా ప్రోత్సహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ సహకారం అందిస్తున్నాయని అన్నారు. వన్ ఫ్యామిలి -వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమాన్ని కూడా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఆహారం, పానీయాల రంగంలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇస్తామని అన్నారు. అగ్రిటెక్ రంగంలో బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. ట్రేసబిలిటి, సర్టిఫికేషన్, ప్యాకేజింగ్ లాంటి సవాళ్లపై దృష్టి పెడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. మరోవైపు భారత్‌లో తయారయ్యే ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలతో గ్లోబల్ బ్రాండ్స్‌గా ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అందమైన విశాఖ ఇప్పుడు దేశంలోనే మహిళలకు అత్యంత సురక్షితమైన నగరంగా ఖ్యాతి గడించిందన్నారు. త్వరలోనే సీ కేబుల్, డేటా సెంటర్లు కూడా విశాఖలో ఏర్పాటు కాబోతున్నాయని తెలిపారు. ఏపీలో ఆహార శుద్ధి సహా వ్యవసాయాధారిత పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడులను ప్రోత్సహించేందుకు అమరావతిలో ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చాప్టర్ ఏర్పాటు కానుండటం సంతోషదాయకమని ముఖ్యమంత్రి అన్నారు.

# జగన్.. ఇదే నా నువ్వు కట్టిన ప్యాలెస్

జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గత ప్రభుత్వ హయాంలో రుషికొండపై నిర్మించిన ప్యాలెస్ ను పరిశీలించి తీవ్ర ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విశాఖపట్నం పర్యటనలో ఉన్న పవన్ కల్యాణ్... మంత్రులు, జనసేన ఎమ్మెల్యేలతో కలిసి రుషికొండకు చేరుకున్నారు. భవనాల లోపల ఉన్న అత్యంత విలాసవంతమైన బెడ్ రూమ్‌లు, బాత్ రూమ్‌లను చూసి విస్తుపోయారు. ప్రజాధనంతో ఇలాంటి ప్యాలెస్ లు అవసరమా? అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ రుషికొండ ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని పవన్ కల్యాణ్‌కు వివరించారు. గతంలో ఇక్కడ హరిత రిసార్ట్స్ ఉన్నప్పుడు ప్రభుత్వానికి ఏటా సుమారు ఏడు కోట్ల రూపాయల ఆదాయం వచ్చేదని తెలిపారు. కానీ, ఇప్పుడు ఈ కొత్త భవనాల నిర్వహణకే దాదాపు కోటి రూపాయల బిల్లులు బకాయి పడిన దుస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భవనాల నిర్మాణంపై ఇప్పటికే గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు నడుస్తోందని అధికారులు పవన్‌కు తెలిపారు. పరిస్థితిని సమీక్షించిన అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "ప్రకృతితో పెట్టుకుంటే ఉన్నది కూడా పోతుంది" అని వ్యాఖ్యానించారు. రుషికొండ భవనాల నిర్మాణం, ఖర్చు, పర్యావరణ విధ్వంసం వంటి అన్ని అంశాలపై శాసనసభ వేదికగా చర్చ జరగాల్సిన

అవసరం ఉందని ఆయన అన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ నిర్మాణాలను పరిశీలించడానికి ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకున్నారని గుర్తుచేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా, వాస్తవ పరిస్థితులను ప్రజల ముందు ఉంచేందుకు వచ్చానని తెలిపారు. పాడైపోతున్న భవనాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# రాష్ట్ర ప్రగతిలో సీఏలు మార్గదర్శకులు కావాలి

ప్రసంగించారు. జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థను నిర్మించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని లోకేశ్ తెలిపారు. సీఏ లు కేవలం ఖాతా పుస్తకాలు సరిచూసే ఆడిటర్లు మాత్రమే కాదని, బాధ్యతకు, జవాబుదారీత నానికి ప్రతిరూపాలని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి బ్రాండ్ అంబాసడర్లుగా మారి, ప్రభుత్వ విధానాల రూపకల్పనలో నైతిక సలహాలు అందించాలని కోరారు. విశాఖపట్నంలో అకౌంటింగ్, ఆడిటింగ్ రంగంలో ఒక 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటుకు ఐసీఏఐ చొరవ చూపాలని సూచించారు.

**ఒకే రాజధాని.. ప్రాంతీయ అభివృద్ధి**

'ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ' అనే నినాదంతో తాము ముందుకెళ్తున్నామని లోకేశ్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు. అనంతపురంలో ఆటోమోటివ్, కర్నూలులో పునరుత్పాదక ఇంధనం, చిత్తూరులో ఎలక్ట్రానిక్స్, ఉత్తరాంధ్రలో ఐటీ, ఫార్మా రంగాలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. మరో ఏడాదిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తయితే విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల స్వరూపం పూర్తిగా మారిపోతుందని ధీమా వ్యక్తం చేశారు.

**పాలనలో సాంకేతికతకు పెద్దపీట**

పరిపాలనలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. ఏఐ ఆధారిత పాలన ద్వారా ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు. ఇప్పటికే 'మనమిత్ర' ద్వారా 700 రకాల పౌర సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ విధానాల వల్లే గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ సంస్థలు విశాఖకు వస్తున్నాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఐసీఏఐ ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్, ఇతర ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.ం

## తాడిపత్రికి వెళ్లేందుకు తొలగిన అడ్డంకులు..

# పెద్దారెడ్డికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

వైసీపీ నేత, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. తాడిపత్రిలోకి ప్రవేశించేందుకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయంలో గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించింది. వివరాల్లోకి వెళితే, తనను తాడిపత్రిలోకి రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ కేతిరెడ్డి పెద్దారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, ఆయన వాదనలతో ఏకీభవించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ దవే, పి. సుధాకర్ రెడ్డి, అల్లంకి రమేశ్ వాదనలు వినిపించారు. రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం రాజకీయ కక్షతో, అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ పెద్దారెడ్డిని సొంత నియోజకవర్గానికి దూరం చేస్తోందని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ధర్మాసనం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "మిమ్మల్ని మీ నియోజకవర్గంలోకి వెళ్లకుండా ఎవరు ఆపగలరు?" అని ప్రశ్నించింది. భద్రత విషయంలో ఆందోళన ఉంటే, అవసరమైతే ప్రైవేట్ సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. లఅంతేకాకుండా, కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లే సమయంలో ఆయనకు తగిన భద్రత కల్పించాలని రాష్ట్ర పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. పోలీసు భద్రతకు అయ్యే ఖర్చులను తామే భరిస్తామని పెద్దారెడ్డి తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలపడంతో ధర్మాసనం అంగీకరించింది. తాజా ఉత్తర్వులతో కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలో పర్యటించేందుకు న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయినట్లయింది.

# ఐఏఎస్ అధికారిణి చీరలు, విగ్గుల గురించి మాట్లాడటం సిగ్గుచేటు

వైసీపీ నేతల తీరుపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ చింతా మోహన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఓ మహిళా ఐఏఎస్ అధికారిణిని (శ్రీలక్ష్మి) లక్ష్యంగా చేసుకుని వైసీపీ నేత భూమన కరుణాకర రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేయడం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల విగ్గులు, చీరల గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ఈరోజు గుంటూరులో పర్యటించిన చింతా మోహన్ మీడియాతో మాట్లాడుతూ... "దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చెప్పిన చోటల్లా సంతకాలు చేసి, ఆయన కోసం జైలుకు కూడా వెళ్లిన అధికారిణి ఆమె. తమ అక్రమాల కోసం ఆమెను వాడుకుని, ఇప్పుడు ఇలా వ్యక్తిగతంగా దూషించడం సరికాదు" అని హితవు పలికారు. వైసీపీ నేతలు వెంటనే ఆ అధికారిణికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర, జాతీయ రాజకీయాలపై ఆయన స్పందించారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే వారికి గిట్టుబాటు ధర కల్పించి, రుణమాఫీ చేయాలని సూచించారు. సినీ పరిశ్రమకు ప్రోత్సాహకాలు ఇస్తున్న ప్రభుత్వం, అన్నం పెట్టే రైతులకు ఎందుకు అండగా నిలవడం లేదని ఆయన ప్రశ్నించారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై కూడా చింతా మోహన్ తీవ్ర ఆరోపణలు చేశారు. దేశంలో ప్రతిపక్ష పార్టీలను నాశనం చేయాలనే దురుద్దేశంతోనే కేంద్రం పనిచేస్తోందని విమర్శించారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రిని సైతం శిక్షించేలా రాజ్యాంగ సవరణలు తీసుకువస్తున్నారని ఆరోపించారు. దేశంలోని బ్యాంకులు 90 శాతం రుణాలను కేవలం కార్పొరేట్ సంస్థలకే కట్టబెడుతున్నాయని, ఇటీవల మాఫీ చేసిన రూ.14 లక్షల కోట్ల రుణాలలో ఎవరి వాటా ఎంతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## రామసేతుకు జాతీయ హెూదా

# కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు

రామసేతువును జాతీయ వారసత్వ కట్టడంగా ప్రకటించాలన్న డిమాండ్‌పై సుప్రీంకోర్టు కీలక ముందడుగు వేసింది. ఈ అంశంపై బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్యస్వామి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. నిర్దిష్ట సమయంలోగా దీనిపై నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ స్వామి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) డైరెక్టర్, ఏఎస్ఐ తమిళనాడు ప్రాంతీయ డైరెక్టర్ ఈ నోటీసులకు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. స్వామి తరఫున సీనియర్ న్యాయవాది విభా దత్తా మఖిజా, న్యాయవాది సత్య సబర్వాల్ వాదనలు వినిపించారు. రామసేతువును జాతీయ స్మారక చిహ్నంగా ప్రకటించే విషయంలో తన విజ్ఞప్తిపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సుబ్రహ్మణ్యస్వామి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రామసేతువుకు సంబంధించిన మతపరమైన, చారిత్రక ప్రాముఖ్యతను గుర్తించి, దాని పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నారు. ఈ విషయంపై గత ఏడాది జనవరిలోనే సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ప్రభుత్వానికి మరిన్ని పత్రాలు సమర్పించేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో, మే 13న మళ్లీ కేంద్ర సాంస్కృతిక మంత్రికి విజ్ఞప్తి చేసి, తాజాగా సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ వేశారు.

# రుషికొండ భవనాల వినియోగంపై ఏపీ ప్రభుత్వం దృష్టి

- మొదటి పేజీ తరువాయి

కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేశారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న భవనాలను సముచితంగా వినియోగించే మార్గాలను అన్వేషించి, తగిన సిఫార్సులు ప్రభుత్వానికి అందజేయాలని కమిటీకి సూచించారు.

ఖ

## జగన్ కోసమే మోదీ సీబీఐ గొంతు నొక్కారు

- మొదటి పేజీ తరువాయి

షర్మిల సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి జగన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీకి జగన్ దత్తపుత్రుడని, అందుకే జగన్‌ను, ఆయన సోదరుడు అవినాశ్ రెడ్డిని కాపాడటం కోసం మోదీ సీబీఐ గొంతు నొక్కుతున్నారని ఆరోపించారు. వివేకా హత్య కేసు దర్యాప్తును ప్రస్తావిస్తూ, ఈ కేసులో మళ్లీ విచారణ ఎందుకు చేపట్టరని ప్రభుత్వాన్ని షర్మిల సూటిగా ప్రశ్నించారు. "వై నాట్?" అంటూ నిలదీశారు. ఇన్నేళ్లుగా న్యాయం కోసం పోరాటం చేస్తున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా కుమార్తె సునీత చేస్తున్న పోరాటంలో పూర్తి న్యాయం ఉందని, ఆమెకు తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ పనితీరుపై షర్మిల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "సీబీఐ అనేది మోదీ చేతిలో ఒక కీలుబొమ్మగా మారిపోయింది. నిజంగా సీబీఐ చిత్తశుద్ధితో పనిచేసి ఉంటే ఈపాటికే దోషులకు శిక్ష పడేది" అని అన్నారు. హత్య జరిగినప్పుడు సంఘటనా స్థలంలో అవినాశ్ రెడ్డి ఉన్నారని చెప్పడానికి గూగుల్ మ్యాప్ లొకేషన్లతో సహా బలమైన ఆధారాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇన్ని సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ, అవినాశ్ రెడ్డిని కాపాడటానికే దర్యాప్తును నీరుగారుస్తున్నారని ఆమె ఆరోపించారు. సీబీఐ దర్యాప్తు సరిగ్గా జరగడం లేదని సునీత చేస్తున్న ఆరోపణల్లో నిజం ఉందని షర్మిల పేర్కొన్నారు.

## గణేష్ నిమజ్జనాలు షురూ.. ట్యాంక్ బండ్ దగ్గర ట్రాఫిక్ ఆంక్షలు

- మొదటి పేజీ తరువాయి

అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు పోలీసులు. నిమజ్జన ఊరేగింపునకు సీసీ కెమెరాలు, డ్రోన్లు, %ు=% కోడ్ స్కిక్కర్లతో పర్యవేక్షిస్తున్నారు.

## బీసీసీఐ అధ్యక్ష పదవికి రోజర్ బిన్నీ రాజీనామా.. తాత్కాలిక ప్రెసిడెంట్‌గా రాజీవ్ శుక్లా!

- మొదటి పేజీ తరువాయి

బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. సెప్టెంబర్‌లో జరగనున్న బీసీసీఐ ఎన్నికల వరకు శుక్లా ఈ పదవిలో కొనసాగుతారు. నేషనల్ మీడియా కథనాల మేరకు బుధవారం నిర్వహించిన బీసీసీఐ అపెక్స్ కౌన్సెల్ సమావేశం రాజీవ్ శుక్లా నేతృత్వంలో జరిగింది.. వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో రోజర్ బిన్నీ మళ్లీ పోటీ చేసి గెలిస్తే అధ్యక్షుడిగా కొనసాగే అవకాశం ఉంటుంది. లేనిపక్షంలో సెప్టెంబర్ తర్వాత బీసీసీఐకి కొత్త అధ్యక్షుడు రానున్నారు.

**కొత్త స్పాన్సర్ కోసం తీవ్ర సవాళ్లు**

ఈ సమావేశంలో ప్రధానంగా టీమిండియా కొత్త లీడ్ స్పాన్సర్ అంశంపై చర్చ జరిగినట్లు తెలిసింది. డ్రీమ్11తో ఒప్పందం ముగియడంతో భారత జట్టుకు ప్రస్తుతం ప్రధాన స్పాన్సర్ లేరు. సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇంత తక్కువ సమయంలో కొత్త స్పాన్సర్‌ను ఖరారు చేయడం బీసీసీఐకి పెద్ద సవాలుగా మారింది. "కొత్త టెండర్ పిలిచి, చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేయడానికి సమయం పడుతుంది. అందుకే ఆసియా కప్‌నకు మాత్రమే తాత్కాలిక స్పాన్సర్‌ను తీసుకునే ఆలోచన లేదు. 2027 వన్డే ప్రపంచకప్ వరకు, అంటే సుమారు రెండున్నరేళ్ల పాటు దీర్ఘకాలిక స్పాన్సర్‌ను తీసుకురావడమే మా లక్ష్యం" అని బోర్డు వర్గాలు స్పష్టం చేసినట్లు నివేదికలు పేర్కొన్నాయి.

**పాత నిబంధనల ప్రకారమే ఎన్నికలు**

ఇటీవల పార్లమెంటులో కొత్త జాతీయ క్రీడా పాలన చట్టం ఆమోదం పొందినప్పటికీ, అది పూర్తిగా అమల్లోకి రావడానికి మరో నాలుగు నుంచి ఐదు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ కారణంగా సెప్టెంబర్‌లో జరిగే బీసీసీఐ ఎన్నికలు, ప్రస్తుతం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు లోధా కమిటీ సిఫార్సులతో రూపొందించిన రాజ్యాంగం ప్రకారమే జరుగుతాయని తెలిసింది. ఈ పాత నిబంధనల ప్రకారం, ఆఫీస్ బేరర్ల వయోపరిమితి 70 ఏళ్లుగా ఉండగా, కొత్త చట్టంలో దానిని 75 ఏళ్లకు పెంచే అవకాశం కల్పించారు.

## పిన్నెల్లి సోదరులకు నిరాశ.. ముందస్తు బెయిల్ కు హైకోర్టు నిరాకరణ

- మొదటి పేజీ తరువాయి

పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి ప్రమేయం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ప్రత్యక్ష సాక్షి తోట ఆంజనేయులు ఫిర్యాదు మేరకు పిన్నెల్లి సోదరులపై కేసు నమోదు చేశారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఏ6గా, పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిని ఏ7గా ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు. ఈ జంట హత్య కేసులో పిన్నెల్లి సోదరుల పాత్ర ఉందనేందుకు తగిన ఆధారాలున్నాయని పోలీసుల తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ ఈ నెల 21న వాదనలు వినిపించారు. ఈ కేసులో వాస్తవాలను వెలికితీయాలంటే పిన్నెల్లి సోదరులను కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉందని కోర్టుకు తెలిపారు. రాజకీయంగా, ఆర్థికంగా బలవంతులైన పిన్నెల్లి సోదరులకు బెయిల్ ఇస్తే దర్యాప్తును ప్రభావితం చేస్తారని వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం.. పిన్నెల్లి సోదరుల పిటిషన్ ను కొట్టివేసింది.

## జపాన్, భారత్ కలిస్తే అద్భుతాలే

- మొదటి పేజీ తరువాయి

అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ మనదే" అని స్పష్టం చేశారు. దేశంలో పెట్టుబడులు కేవలం పెరగడమే కాకుండా, అవి రెట్టింపు అవుతున్నాయని ఆయన వివరించారు. భారత్, జపాన్ మధ్య భాగస్వామ్యం కేవలం వ్యూహాత్మకమే కాదని, అదొక స్మార్ట్ బంధమని ప్రధాని అభివర్ణించారు. ఈ రెండు దేశాల కలయిక ఆసియా శతాబ్దంలో స్థిరత్వం, వృద్ధి, శ్రేయస్సును నిర్దేశిస్తుందని ఆయన అన్నారు. సాంకేతిక రంగంలో భారత్, జపాన్ కలిసి పనిచేసే అవకాశాలపై మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఏఐ, సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్, అంతరిక్ష రంగాల్లో భారత్ ఎంతో ధైర్యమైన, ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలు చేపట్టింది. జపాన్ సాంకేతికత, భారత ప్రతిభావంతుల మేధస్సు కలిస్తే ఈ శతాబ్దపు సాంకేతిక విప్లవానికి నాయకత్వం వహించవచ్చు" అని మోదీ తెలిపారు. ఈ రెండు దేశాల ఉమ్మడి ప్రయోజనాలు ఉమ్మడి శ్రేయస్సుగా మారాయని, జపాన్ వ్యాపారాలకు భారత్ ఒక మంచి వేదిక అని ఆయన పేర్కొన్నారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# గణపతి నవరాత్రుల్లో ఆకట్టుకున్న కోలాటం



**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 29:** గణపతి నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని నెల్లిపూడి లో నిర్వహించిన కోలాటం నృత్యాలు విశేషంగా ఆకర్షించాయి. నెల్లిపూడి అంబేద్కర్ సెంటర్లో ఏర్పాటు చేసిన శ్రీ గణపతి నవరాత్రుల మహోత్సవ కార్యక్రమంలో తెలుగు యువత నియోజవర్గ ఉపాధ్యక్షులు ముచ్చకర్ల శివ ఆధ్వర్యంలో కోలాటం కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు.

## జిల్లా 22 మండలాల అధికారులతో
# కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

- గోదావరి నదికి వరదలు ఉధృతం అయ్యే అవకాశం
- కలెక్టర్ డాక్టర్ వావిరాల మహేష్ కుమార్






**అమలాపురం.పెన్ పవర్ ఆగస్టు 29:** ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి పటిష్టమైన చర్యలు గైకొనాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఎంపీడీవోలను నియోజకవర్గం ప్రత్యేక అధికారులను తాసిల్దార్లను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుండి 22 మండలాల ఎంపీడీవోలు తాసిల్దార్లు మండల నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ భారీ వర్షాలు వరదలను ఎదుర్కొనేందుకు సన్నద్ధత చర్యలపై దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ శనివారం బ్యాంకుల నుండి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్మును విత్డ్రా చేస్తూ శనివారం రాత్రి నుం డి సోమవారం ఉదయం వరకు ఫీల్డ్ ఫంక్షనరీస్ మీద నమ్మకంతో నిధులు భద్రప రుస్తూ సోమవారం ఉద యాన్నే యధావిధిగా గత మాసంలో ఏ విధంగా అందరికీ సామా జిక భద్రత పింఛన్లు పంపిణీ చేశారో వారందరికీ పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్ల పునః విచారణ చేయాలని సూచించిందని, ఆ ప్రకారం జిల్లాలో సుమారు 32 వేల మంది దివ్యాంగులు 13 శాతం ఉన్నారని వీరికి ప్రస్తుతం మాసంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా పింఛన్లు అందుతాయని ఆయన స్పష్టం చేశారు. జిల్లావ్యా ప్తంగా సుమారు 27 క్యాటగి రీలలో రూ 101 కోట్లు సం బంధిత ప్రజాప్రతినిధుల అందుబాటుకు అనుగుణంగా వారి సమక్షంలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. దివ్యాం గులకు పింఛన్ల పంపిణీలో కోత విధించారనే ఫిర్యా దులు రాకుండా చూడాలని అధి కారులు సూచించారు.గోదావరి నదికి మరలా వరదలు ఉధృతమయ్యే అవకాశం ఉందని రేపటికి ధవలేశ్వరం వద్ద మొదటి హెచ్చరిక వెలువడే అవకాశం ఉన్నదని, ఈ నెల 31 సాయం త్రానికి రెండో హెచ్చ రిక వేలువడే అవకాశాలు ఉన్నాయన్నారు. గత పది రోజులలో వరదలు భారీ వర్షాల పట్ల ఏ విధమైన చర్యలు తీసుకున్నారో అదే స్థాయిలో మరల సన్నద్ధత చర్యలను చేపడుతూ అప్రమత్తంగా వ్యవహరిం చాలని ఆదేశించారు. వరద హెచ్చరికలకు అనుగుణం గా లోతట్టు ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ ఆస్తి ప్రాణ నష్టాలకు ఆస్కారం లేకుండా సహాయక చర్యలు చేపట్టాలన్నారు.ము%శీ%పు లోతట్టు ప్రాంతాలలో రోడ్ల క్రాసింగ్ వద్ద బోట్లు ఏర్పాటు చేయాలన్నారు. సెప్టెంబరు మూడు నాలుగు తేదీలలో వినాయక నిమజ్జనం కార్యక్రమాలు నిర్వహిస్తారని, ఉత్సవ కమిటీలు ముందుగా సూచించిన నిమజ్జన ప్రాంతాలలో ఉత్సవ విగ్రహాలను బట్టి క్రేన్లు ,ట్రాక్టర్లు ఏర్పాటు చేసి ఎటువంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా వ్యవహరించాలని సూచించారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలు వరదలు ప్రవాహం ఎక్కువగా ఉన్న దృష్ట్యా మరింత జాగరూకతతో నిమజ్జన ఘట్టాల వద్ద వ్యవహరించి సజా వుగా నిమజ్జనాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే మాధవి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కేశవ వర్మ,డి ఆర్ డి ఎ ,పి డి గాంధీ,డి ఎం అండ్ హెచ్ ఓ ఎం దుర్గారావు ద్వారా ఆర్డబ్ల్యూఎస్ డీఈ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

## వికాలంగుడ్ని ఢీకొట్టిన ఘటనలో
# బాధితుడికి న్యాయం చేయాలి..

**వీసికే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ**



**అల్లవరం, పెన్ పవర్, ఆగష్టు 29:** భార్య, కుమారిడితో మూడు చక్రాల వాహనంపై ఇంటికి వెళుతున్న కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన నెల్లి ఏడుకొండలును అల్లవరం మండలం గోడితిప్ప వద్ద మద్యం మత్తులో వాహనం నడుపుతూ బలంగా ఢీకొట్టి పారిపోయిన గోడిలంక గ్రామానికి చెందిన వాసర్ల రామకృష్ణ పై చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వీసికే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ డిమాండ్ చేశారు. ఈ ఘటనలో బాధితుని రెండు కాళ్లకు నాలుగు చోట్ల విరిగిపోయిన నేపథ్యంలో శుక్రవారం అతను చికిత్స పొందుతున్న కిమ్స్ ఆసుపత్రికి వెళ్లి రమణ పరామర్శించారు. దీనిపై రమణ మాట్లాడుతూ దళితుడైన వికలాంగుడు ఏడుకొండలు, అతని భార్య రోజూ అమలాపురం వచ్చి ప్రయివేటుగా పనిచేసుకుంటేనే కానీ పూట గడవని నిరుపేదలని, అయితే మద్యం సేవించి ర్యాష్ డ్రైవింగ్‌తో ఢీకొట్టడమే కాకుండా కనీసం మానవత్వం అనేది లేకుండా అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడని, స్థానికంగా కొందరు ఆసుపత్రికి తీసుకెళ్లాలని ఒత్తిడి చేయడంతో కేవలం అల్లవరం సీహెచ్‌సీ వరకు వచ్చి అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయాడని, ఆతరువాత కూడా ఇంతవరకు కనీసం తీవ్ర గాయాలపాలైన వికలాంగుడైన బాధితుడు ఏమయ్యాడో అనే ఆలోచన లేకుండా తప్పించుకు తిరుగుతున్నాడని ఆరోపించారు. పైగా తన భర్తకు ఏమయ్యిందో తెలియక తీవ్ర భయాందోళనలో ఉన్న అతని భార్య వెంకటరమణిని సదరు రామకృష్ణ బెదింరిపు ధోరణిలో మాట్లాడాడని ఆవేదన వ్యక్తం చేసిందన్నారు. అతనికి వత్తాసు పలుకుతూ గోడిలంక గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త, టీడీపీ గ్రామకమిటీ నాయకుడు ఇద్దరు సిటింగ్ పేరుతో బాధితుడి కుటుంబికులను పిలిచి న్యాయం చేయకపోగా ఆపై ఇష్టమొచ్చినట్లు చేసుకోవాలని దురుసుగా మాట్లాడారని బాధితుల కుటుంబికులు వాపోయారని మండిపడ్డారు. దళితుడైన వికలాంగుడు ఏడుకొండలు ఈ పరిస్థితికి మద్యం సేవించి డ్రైవింగ్ చేయడమే కాకుండా యాక్సిడెంట్ చేసి ఆపై బాధితుడి భార్యను బెదిరింపు ధోరణిలో మాట్లాడి మానసికంగా వేధించిన వ్యక్తిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి బాధితునికి న్యాయంచేయాలని రమణ డిమాండ్ చేశారు.

## రాష్ట్ర మహిళా కమీషన్ చైర్‌పర్సన్ శైలజని కలిసిన
# కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 29:** జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు డి.నరసింహ కిషోర్ శుక్రవారం రాత్రి స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో బస చేసిన రాష్ట్ర మహిళా కమీషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా మహిళా సంక్షేమం, రక్షణ, హక్కుల పరిరక్షణ, జిల్లా స్థాయిలో సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, అందుబాటులో ఉన్న వనరులు, భవిష్యత్ కార్యాచరణ వంటి పలు అంశాలపై చర్చించి అభిప్రాయాలు పంచుకున్నారు. రాష్ట్ర మహిళా కమీషన్ సూచనలు, మార్గదర్శకాలను అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పని చేస్తుందని కలెక్టర్, ఎస్పీ తెలిపారు.

## బాల్య వివాహాలపై
# అవగాహన సదస్సు...




**కపిలేశ్వరపురం, పెన్ పవర్,ఆగస్టు 29.** జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు, ఆలమూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కపిలేశ్వరపురం మండలం, అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సి వైద్యురాలు డాక్టర్ కుమారి, దీపిక, న్యాయవాదులు కె. ధనరాజు, ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బి.వి. ప్రసన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ, బాల్య వివాహాలు సమాజ అభివృద్ధికి అడ్డంకిగా మారతాయని, చిన్న వయసులో వివాహం జరిగితే ఆడపిల్లల విద్య ఆగిపోవడంతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అలాంటి వివాహాలను అడ్డుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. సమాజంలో బాల్య వివాహాలు చేయడం వలన కలిగే ప్రతికూల ఫలితాలను, చిన్న వయసులో గర్భం దాల్చడం వలన తలెత్తే ఆరోగ్య సమస్యలను నిపుణులు వివరించారు. అదేవిధంగా బాల్య వివాహాలను నివారించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను అవగాహన కల్పించారు.

## చింతూరు డివిజన్ మెడికల్ డిపార్ట్మెంట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి




**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు 29.** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర నాయుడు మండలంలోని కోతులుగుట్ట నందు ఉన్న సిహెచ్సి హాస్పటల్ సందర్శించారు.ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ విశ్వేశ్వర నాయుడు కు 4 మండలాల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందించారు.4సం లో చింతూరు డివిజన్ పరిధిలో ఉన్న 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలలో సీనియర్ అసిస్టెంట్,జూనియర్ అసిస్టెంట్లు లేకపోవడం మూలంగా మెడికల్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు సర్వీస్ పరంగా ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు.ప్రమోషన్ పొందిన 14 మంది గ్రామ సచివాలయం ఏ యన్ యం లకు 3 నెలలుగా జీతాలు లేకుండా ఇబ్బందులు పడుకున్నారని అన్నారు.కూనవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందిని వెంటనే నియమించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు.డి యం హెచ్ ఓ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి జి సీతమ్మ,రాష్ట్ర కోశాధికారి కరక అర్జున్,సీనియర్ నాయకులు మానె రాంప్రసాద్,డివిజన్ ప్రధాన కార్యదర్శి తాటి రామకృష్ణ సొందే.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

# నిర్వహణ లేక..నిర్లక్ష్యం వీడక





చెత్త నిర్వహణ లోపాలు ప్రజల పాలిట శాపాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యం పల్లెల్లో పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరించి ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రాలకు తరలిస్తున్నారు. అక్కడ చెత్త నిర్వహణ ఏ మాత్రం జరగడం లేదు. కుళ్లే స్వభావం ఉన్నవాటిని వేరు చేసి ఘన వ్యర్థ కేంద్రంలోని నాడప్ తొట్టెల్లో వేసి వర్మి కంపోస్ట్ తయారు చేయాల్సి ఉంది. అయితే ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రాలకు చేరుతున్న చెత్తను వేరు చేసేందుకు కార్మికులు లేరు. ఉన్నవారు ఉదయం చెత్త సేకరించి తరలించడానికి సరిపోతున్నారు. పైగా వీరికే జీతాలు సరిగా చెల్లించడం లేదు.

- అధ్వానంగా శ్రీపర్రు సంపద కేంద్రం
- పట్టించుకోని పంచాయితీ అధికారులు

**ఏలూరు ఆగస్టు 29 పెన్ పవర్ :** ఏలూరు రోడ్డు మండలం లంక గ్రామాల్లో ఏ ఒక్క పంచాయతీలోనూ ఘన వ్యర్థ కేంద్రాలు పని చేయడం లేదు. పేరుకుపోతున్నడంతో పారిశుద్ధ్య కార్మికులే చెత్త నిల్వలకు నిప్పు పెడుతున్నారు. కొన్నిచోట్ల కాలువలు,రోడ్ల, వెంబడి డ్రైన్ల వద్ద, చెత్త పారబోయడంతో సాగునీరు విడుదల చేసే సమయంలో కొట్టుకుపోతోంది. ఈ విధంగా చేయడంతో వ్యర్థాలు పంట పొలాలకు చేరుతుందని రైతులు వాపోతున్నారు. వ్యర్థాలకు నిప్పు పెట్టడం, కాలువల్లో పారబోత వల్ల పర్యావరణం దెబ్బ తింటుందని, ఆందోళన వ్యక్తం అవుతోంది. దీనిపై ఏలూరు డివిజన్ డిఎల్పిఓ అమ్మాజీ మాట్లాడుతూ ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రాల్లో సంపద సృష్టికి సనాహాలు చేస్తున్నాం. ఎక్కడైనా చెత్త కొన్ని నిప్పు పెట్టినట్లు తెలిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. అన్ని డంపింగ్ యార్డ్ లోనూ చెత్త నిర్వహణ చేపడుతున్నాం. ఈ పనులు చేయకుంటే చర్యలు ఉంటాయి అన్నారు.

## ఏపీ మెగా డీఎస్సీ ఫలితాల్లో విజయం సాధించిన శర్మ కుసుమ దేవి



**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు 29:**సీతానగరం మండలంలోని సింగవరం గ్రామానికి చెందిన శర్మ కుసుమా దేవి23 సంవత్సరాలు ఇటీవల ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన ఏపీ డీఎస్సీ ఫలితాల్లో 100 మార్కులకు గాను 75.40587 మార్కులు సాధించి తూర్పు గోదావరి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ టీచర్ గా 60 వ ర్యాంక్ లో నిలిచింది. ఈ సందర్భంగా శర్మ కుసుమదేవి మాట్లాడుతూ ఎలాంటి కోచింగ్ లేకుండా , రాత్రింబవళ్ళు కష్టపడుతూ కేవలం బీఈడీ బుక్స్ చదివి , అతి తక్కువ వయస్సులో ,మొదటి ప్రయత్నం లోనే ఈ ఉద్యోగం సాధించాను అని చెప్పారు. తన చదువు మరియు విజయం లో అమ్మమ్మ తాతయ్య ప్రధాన పాత్ర పోషించారు. అనితెలిపారు.తనకు ఈ ఉద్యోగం రావడంతో బంధువులు, గ్రామ ప్రజలు, స్నేహితులు హర్ష వ్యక్తం చేశారు.

## అంబేద్కర్ చూపించిన మార్గం దేశానికి నిత్యస్ఫూర్తి .... ధర్నాలకోట శ్రీను





**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు 29 :**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను రాజ్యాంగ రూపకల్పన కమిటీ చైర్మన్‌గా నియమించి 78 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ప్రత్తిపాడు అంబేద్కర్ కళామందిరం సెంటర్లో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పీసీసీ సభ్యులు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీను అంబేద్కర్ చూపించిన మార్గం దేశానికి నిత్యస్ఫూర్తి అని, రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిన మహత్తర పత్రం అని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన జీవితాంతం పోరాడిన త్యాగాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కందిమల్ల సామెల్, దాసరి సత్తిబాబు, స్వర్ణపుడి కోటేశ్వరరావు, మూరా రాంబాబు, మెడపాటి కృష్ణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ర్యాగింగ్ చేయకండి-ర్యాగింగ్ ను ఆపండి

- ర్యాగింగ్ వద్దు-స్నేహం ముద్దు
- ఎస్పీ డి.నరసింహ కిషోర్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 29:**రాజమహేంద్రవరంలోని మోరంపూడిలో శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో 10 వ తరగతి చదువుచున్న విన్సెంట్ ప్రసాద్ అనే హాస్టల్ విద్యార్థి ఈ నెల 17వ తేది రాత్రి 9.30 గంటల సమయంలో తన తోటి హాస్టల్ విద్యార్థులు కొట్టినట్లు స్థానిక పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయడం జరిగింది. వివరాల్లోకి వెళితే ఆ ఇద్దరు విద్యార్థులు హాస్టల్ నందు సిసి కెమెరాను తొలగించి వారి వద్ద దాచుకొన్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ ఎంక్వయిరీ చేయగా విన్సెంట్ ప్రసాద్ ద్వారా ప్రిన్సిపాల్ కు విషయం తెలిసింది. ఆ విషయమై ఆ ఇద్దరు విద్యార్థులు మనసులో పెట్టుకొని కక్ష పెంచుకొని, 18వ తేదీన ప్రసాద్ వీపుపై కర్రలతో కొట్టి, చంపాలనే ఉద్దేశంతో ఐరన్ బాక్స్ వేడి చేసి తీవ్ర గాయములు చేసినారు. ఈ విషయములు ప్రసాద్ స్థానిక పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసారు. కేసు దర్యాప్తులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు డిప్యూటీ సూపరింటెండెంట్ బి.విద్య పర్యవేక్షణలో బొమ్మూరు ఇన్స్పెక్టర్ పి.కాశీ విశ్వనాథం, సబ్ ఇన్స్పెక్టర్ సిహెచ్.వి.రమేష్ ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బంది సహాయంతో పిర్యాదిదారుడు ఇచ్చిన కంప్లైంట్ మేరకు వారిరువురిని అదుపులో తీసుకొని కోర్టులో అప్పగిస్తామని పోలీసులు తెలిపారు. అదేవిధంగా కాలేజీ యాజమాన్యం సరైన చర్యలు తీసుకోక పోవటంతో, వారి పై ర్యాగింగ్ యాక్ట్ ప్రకారం శ్రీ చైతన్య టెక్నో స్కూల్ హాస్టల్ ప్రిన్సిపాల్ ఏ3 గుట్టుపల్లి మధుసూధన్, హాస్టల్ ఫ్లోర్ ఇంచార్జ్ ఏ4 పల్లి దామోదర్ లను అదుపులోనికి తీసుకొని కోర్టులో హాజరు పరుస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆనందంగా జీవితాన్ని గడపాలని, ఇతరులను ఇబ్బందికి గురిచేయాలని, బాధపెట్టాలనే మానసిక రుగ్మతే ర్యాగింగ్ అని, ర్యాగింగ్ కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీనియర్ విద్యార్థులు మీ జూనియర్లకు ఆదర్శప్రాయులుగా ఉండాలన్నారు. మీ మార్గదర్శకత్వం వారి విద్యా ప్రయాణాన్ని రూపొందిస్తుందని చెప్పారు. భయం ద్వారా కాదు, స్నేహం ద్వారా ముందుకు సాగాలన్నారు. కలుపుగోలుతనం, పరస్పర గౌరవం యొక్క సంస్కృతిని పెంపొందించడానికి ప్రతి ఒక్కరు ప్రయత్నించాలన్నారు.

తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తారని, తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలన్నారు.

## సంచార అర్ధ సంచార జాతుల విముక్తి దినోత్సవం

-ఒబిసి,బిజెపి,జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.వి.వి.ప్రసాద్



**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.29:**మన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా ఈనెల ముప్పై తారీకున విజయవాడ వెన్యూ ఫంక్షన్,హాల్,వద్ద శనివారం జరగబోవు సంచార అర్ధ సంచార జాతుల విముక్త దినోత్స వం కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షు లు పి.వి.ఎన్.మాధవ్,ఆదేశాల మేరకు బిజెపి ఓబిసి మో ర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపి శ్రీనివాస్,పర్యవేక్షణలో భారతీయ జనతా పార్టీ విశాఖ ఓబిసి మోర్చా జిల్లా అధ్య క్షులు వల్లిరెడ్డి శ్రీనివాసరావు,బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్య క్షులు పల్లి శ్రీనివాసులు నాయుడు బిజెపి ఓబీసీ రాష్ట్ర కా ర్యదర్శి కంటూభుక్తా శ్రీనివాసరావు తదితర ఒబిసి,బిజెపి పార్టీ నాయకులు పాల్గొన్నారని,నాలుగు మండలాల్లో ఉ న్న సంచార అర్ధ సంచార జాతులు వారు పాల్గొని జయ ప్రదం చే యాలని,ఒబిసి,బిజెపి,జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.వి. వి.ప్రసాద్, ఒక పకటనలో కోరారు.

## జనన మరణ ధృవపత్రాల కుంభకోణం పై చర్యలు తీసుకోవాలి



**అమలాపురం.పెన్ పవర్ ఆగస్టు 29 :**పట్టణ మున్సిపాలిటీ జనన మరణ ధ్రువీకరణ పత్రాల కుంభకోణంపై వర్కర్స్ పార్ట్ ఆఫ్ ఇండియా తీవ్రంగా ఖండించింది....

కోనసీమ జిల్లా వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్రఅధ్యక్షులుదేవాదుల సూర్యనారాయణ మూర్తి అమలాపురం పట్టణ మున్సిపల్ కమిషనర్ కు ఇటీవల జరిగిన అమలాపురం మున్సిపాలిటీ ఆఫీసులో జనన మరణ సర్టిఫికెట్ల అవకతవకలపై కమిషనర్ కు వినతి పత్రాన్ని అందజేసినారు, పట్టణ మున్సిపాలిటీలో జనన మరణ ధ్రువపత్రాలు సైబర్ కు గురవుతున్నాయని,వాటి వలన ప్రజలు ఇబ్బంది పడతారని,ఈ ఘటన గవర్నమెంట్ ఉద్యోగాలు పొందే వారికి ,గవర్నమెంట్ పథకాలు లబ్ది పొందే వారికి తీవ్రమైన నష్టాన్ని గురిచేస్తాయని,పట్టణ మున్సిపాలిటీలో జరిగిన ఈ ఘటనపై త్రివ్రంగా ఖండించారు, ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని, పట్టణ మున్సిపాలిటీలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా సైబర్ సర్టిఫికెట్ల కుంభకోణం జరుగుతోందని,వీటిని అరికట్టవలసిన బాధ్యత అధికారులపై ఉన్నదని,రాష్ట్రవ్యాప్తంగా ఈ ఘటనపై మున్సిపాలిటీ పరిధిలో వినతి పత్రం అందజేసే కార్యక్రమాన్ని వర్కర్ ఆఫ్ ఇండియా చేపడుతుందని తెలిపారు..

ఈ కార్యక్రమంలో ముస్కురి ఏసుబాబు, కొనుకు వెంకటేశ్వరరావు,పితాని బేబీరావు తదితరులు పాల్గొన్నారు.

## చలుమోలు అశోక గౌడ్ ఆధ్వర్యంలో నటుడు సుమన్ జన్మదిన వేడుకలు




**ఏలూరు ఆగస్టు 29 పెన్ పవర్:** ప్రముఖ సినీ నటుడు సుమన్ జన్మదిన వేడుకలు విశాఖలోని అశోక్ హోటల్ లో రాష్ట్ర గౌడ సంఘం వైస్ చైర్మన్ అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, పలువురు గౌడు సామాజిక వర్గం నాయకులు పాల్గొన్నారు.

## ఇందుకూరు గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహణ..

పశువైద్య అధికారి డాక్టర్ రేవంత్.



**దేవీపట్నం,పెన్ పవర్,ఆగష్టు29:**దేవీపట్నం మండలంలోని ఇందుకూరు గ్రామంలో మాజీ సర్పంచ్ టి.గౌర్విశ్వరి ఆధ్వర్యంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పశువైద్య శిబిరం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ రేవంత్ మరియు మండలంలోని పశువైద్య సిబ్బంది సమిష్టిగా పశువుల టీకాలు వేయడం,సర్వే నిర్వహించడం చేపట్టారు.గ్రామంలో ఇప్పటివరకు ఎటువంటి అనూహ్య పశువుల మరణాలు సంభవించలేదని,అయినప్పటికీ భవిష్యత్‌లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త చర్యలలో భాగంగా పశువులకు 29,30వ తేదీల్లో టీకాలు వేస్తామని వైద్యులు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటారని తెలియజేశారు.అత్యవసర మరియు క్లిష్టమైన కేసుల విషయంలో తక్షణమే వైద్యం అందిస్తామని పశువైద్యాధికారి తెలిపారు.అలాగే పశు బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని,అయితే ఈ బీమా పథకం ఆడ పశువులకు మాత్రమే వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## తెలుగు భాషా దినోత్సవ పోటీల్లో మెరిసిన సెయింట్ జేవియర్స్ విద్యార్థులు




**కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 29:**కాకినాడ విద్యుత్ నగర్‌లోని ఐడియల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఆధ్వర్యంలో చిరంజీవిని కుమారి జ్ఞాపకార్థం నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా అనేక సాంస్కృతిక, సాహిత్య పోటీలు నిర్వహించ బడ్డాయి. జిల్లాలోని సుమారు 30 ప్రముఖ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, స్థానిక ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖర్, ప్రముఖ కవి రవి మంత్రి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ పోటీల్లో జగన్నాధపురం, కాకినాడ సెయింట్ జేవియర్స్ హైస్కూల్ విద్యార్థులు తెలుగు పాటల పోటీ మరియు క్విజ్ కార్యక్రమాల్లో రెండింటిలోనూ ద్వితీయ బహుమతి సాధించి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ సునాలిని విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ప్రత్తిపాడులో ఘనంగా బలరామ జయంతి

- విశిష్ట రైతుల సన్మానంతో బలరామ జయంతి వేడుకలు
- కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బలరామ జయంతి ఉత్సవాలు





**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు 29 :**ప్రత్తిపాడు మునసబు రామాలయంలో భారతీయ కిసాన్ సంఘ్ కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బలరామ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముందుగా కిసాన్ సంఘ్ జెండా ఆవిష్కరించి, సంఘ నినాదాలు చేశారు. అనంతరం రైతుల ఆత్మకారకం అయిన నాగలికి పూజలు నిర్వహించగా, బలరాముని చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. వేడుకల్లో భాగంగా విశిష్ట రైతులను ఘనంగా సన్మానించారు. ఉత్తమ మహిళా రైతు రొంగల యమున, ఉత్తమ విశ్రాంత సైనికుడు కర్రి ధర్మరాజు, ఉత్తమ సంఘసేవకుడు ముక్కు సుబ్రహ్మణ్యం, ఉత్తమ వృద్ధ రైతు బుద్ద శివన్నారాయణ, ఉత్తమ గోసేవకుడు మాదేపల్లి నాగేశ్వరరావు, ఉత్తమ ప్రకృతి వ్యవసాయ రైతు బాదం రాజు తదితరులను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి గౌరవించారు. తదుపరి సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యల్లపు సూర్యనారాయణ, జిల్లా కోశాధికారి కంపరపు నాగేశ్వరరావు, రాజా బలరాముని జయంతి విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా ప్రముఖ్ దాడిశెట్టి జానకి పావని లక్ష్మి, జిల్లా కార్యదర్శి ఆకుల హరిబాబు, సభ్యులు పెదిరెడ్ల గంగారావు, కాకిలేటి వీర్రాజు, సింగిలిదేవి సత్తిరాజు, అప్పారావు, పంది వీరభద్రరావు, దొంగల సూర్యారావు, కిర్లంపూడి మండల అధ్యక్షుడు రాపేటి శ్రీనివాసరావు, శరకణం రాజబాబు తదితరులు పాల్గొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్టు సుమన్‌కు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం




**కాకినాడ, ఆగస్టు 29 పెన్ పవర్:**ప్రెస్ క్లబ్ సభ్యుడు, సీనియర్ కెమెరామెన్ సుమన్ అనారోగ్యానికి గురైన సంగతి తెలిసిందే. ట్రస్ట్ హాస్పిటల్‌లో ఆయన చికిత్స పొందుతున్న సమయంలో ఆసుపత్రి బిల్లులపై రాయితీ కల్పించేలా సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ సభ్యులు ఆస్పత్రి మేనేజ్మెంట్‌తో చర్చించి సహకారం అందించారు. ఈ క్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్, సెక్రటరీ మోహన్, సానా సతీష్ యూత్ ప్రతినిధులతో మాట్లాడగా, వారు వెంటనే స్పందించి సుమన్ కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు, రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రాజేష్, సెక్రటరీ మోహన్, సభ్యులు రవితదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టు సోదరునికి ఇలాంటి సమయంలో అందరూ తోడ్పాటు అందించడం ప్రశంస నీయం అని సభ్యులు అభిప్రాయ పడ్డారు.

# మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి






రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

**కాకినాడ, పెన్ పవర్, ఆగస్టు 29:**ప్రతి మహిళ వ్యాపారవేత్తగా, పారిశ్రామికవేత్తగా ఎదిగి ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, రక్షణలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ అన్నారు. శుక్రవారం కాకినాడలో జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐసిడిఎస్ విభాగం ఆధ్వర్యంలో మహిళల సంక్షేమం, భద్రత, హక్కుల అంశాలపై నిర్వహించిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మహిళల రక్షణ, భద్రత కేవలం ప్రభుత్వం, పోలీసులు మాత్రమే కాక సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. శక్తి యాప్, మహిళా పోలీస్ స్టేషన్లు, శక్తి టీమ్స్ వంటి ప్రభుత్వ, పోలీస్ విభాగాల చర్యలతో పాటు అవగాహన పెరిగితేనే లైంగిక వేధింపులు,దాడులు తగ్గుతాయని పేర్కొన్నారు. మహిళా కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతోందని, ఫలితంగా జాతీయ సర్వేలో విశాఖపట్నం నగరం బాలికలకు అత్యంత భద్రమైన నగరంగా గుర్తించబడిందని సంతోషం వ్యక్తం చేశారు. ఆడపిల్లలకు గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, పోక్సో, పోస్ చట్టాలపై అవగాహన కల్పించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఎన్జీఓలు మరింత బాధ్యత వహించాలని సూచించారు. అలాగే మగ పిల్లలకు మహిళల పట్ల మర్యాదగా వ్యవహరించేలా నైతిక శిక్షణ అవసరమని తెలిపారు. అకృత్యాలపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, రిపోర్టింగ్ పెరిగితే నేరస్తులకు గట్టి శిక్షలు పడతాయని, దాంతో లింగవివక్ష నేరాలు తగ్గుతాయని ఆమె అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వల్ల మహిళలు ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారని, తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మహిళల పాత్ర మరింత బలపడుతుందని రాయపాటి శైలజ స్పష్టం చేశారు.






# వర్షాకాలంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి





- జిల్లా వైద్యాధికారి విశ్వేశ్వరరావు నాయుడు
- అడిషనల్,డి.ఎం.అండ్,హెచ్.ఒ.పుల్లయ్య

**వి.ఆర్.పురం, పెన్.పవర్,ఆగస్టు29 :** మండలంలోని రేఖపల్లి,ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు వైద్య శాల సిబ్బంది.వర్షాకాలంలో ప్రజలకు వచ్చే వ్యాధులపట్ల మంచి సేవలు అందిస్తున్నారని,జిల్లా వైద్యాధికారి విశ్వే శ్వర రావు నాయుడు తెలిపారు.శుక్రవారం రేఖపల్లి ప్రభు త్వ వైద్యశాలను ఆకస్మికంగా జిల్లా వైద్యాధికారి విశ్వేశ్వర రావు నాయుడు తనిఖీ చేయడం జరిగింది.అనంతరంజ నరల్ వార్డు పరిశీలించి,వైద్యశాల ఉన్న రోగులను వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు.వైద్యశాల స్టాక్, రిజిస్టర్,జనరేటర్,రూమ్,ను రక్త పరీక్షా ల్యాబ్, పరిశీలిం చారు.ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి విశ్వే శ్వరరా వు నాయుడు మాట్లాడుతూ, రేఖపల్లి ప్రభుత్వ వైద్యశాలప నితీరు బాగుందని,సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది.చే స్తున్న సేవలు బాగున్నాయని,అన్నీరకాల సీజనల్ వ్యాధు లకు మందులు అందుబాటు లో ఉన్నాయని టెస్టులు కూ డా ఉన్నాయని,వివరించారు.జిల్లాలలో వైద్యాధికారుల బది లీలు జరుగుతున్నాయని,త్వరలో కొత్త వైద్యులు రేఖ పల్లి ప్రభుత్వ వైద్య శాలకు వస్తారని చెప్పారు.రేఖపల్లి ప్ర భుత్వ వైద్యశాలలో వైద్యసేవలతో పాటు టెక్నికల్,గా సిబ్బంది.పనితీరు చాలా బాగుందని,అభినందిం చారు. బారీ వర్షా లు,వరదలు కారణంగా అన్నవరం వాగు పై నిర్మించి చప్టా, వంతెన వరదలో కొట్టుకు పోవడంతో రోగులు ప్రజల ఇబ్బందులు పడకుండా ఉండ డం కోసం పెద్దమట్టపల్లిలో వైద్య సేవలు అందుబా టులోకి తెచ్చా మని,తెలిపారు.వైద్యశాల చుట్టుప్రక్కల ఉన్న ప్రాంగణాన్ని పరిశీలించారు.అక్కడక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చే యాలని,చూసించారు.జిల్లా వైద్యాధికారి వెంట అడిష నల్ డి.ఏం.అండ్ హెచ్.ఓ.పుల్లయ్య,రేఖపల్లి వైద్యశాల డాక్టర్లు అనిల్ కుమార్,మ హిళా వైద్యురాలు,వైద్యశాల సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## రాజమహేంద్రవరంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్టు 29:**రాజమహేంద్రవరంలోని కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మట్టితో తయారు చేసిన భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేయడం విశేషత సంతరించుకుంది. శుక్రవారం బార్ అసోసియేషన్ హాలులో ప్రముఖ సీనియర్ న్యాయవాది చింతపెంట ప్రభాకరరావు ఆధ్వర్యంలో జరిగిన ప్రసాద వితరణ కార్యక్రమానికి ప్రముఖ వైద్య నిపుణులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చింతపెంట ప్రభాకర్ రావు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, గూడూరి రాధిక దంపతులు, సీనియర్ న్యాయవాదులు వైవిఎస్ శ్యామల, రావిపాటి స్వర్ణలత తదితరులు చవితి ఉత్సవ స్వామివారి ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తోట రామకృష్ణ, చిట్టూరి అన్నవరం, సుంకర సత్యనారాయణ, వంకాయల సత్తిబాబు, న్యాయవాదులు తదితరులు పాల్గొని ప్రసాద స్వీకరణ చేశారు.

## ద్రాక్షారామ జడ్‌పి హైస్కూల్లో ఘనంగా క్రీడా దినోత్సవం

**రామచంద్రపురం,ఆగస్టు 29 పెన్ పవర్:**స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాన్ని శు క్రవారం విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించా రు.హాకీ లెజెండ్ ధ్యానచంద్ జయంతి సందర్భంగా క్రీడా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకున్నారు.ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు, రామచంద్రపురం డివిజన్ ఇన్‌చార్జ్ ఆని శ్రీనివాస్ మాట్లాడుతూ, క్రీడలు శారీరక, మానసిక అభివృద్ధికి దోహదం చేస్తాయని, జీవన నైపుణ్యాల పెంపకానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని విద్యార్థులకు సూచించారు.తెలుగు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, “తెలుగు భాషా వికాసమే మనోవికాసానికి బాటలు వేస్తుంది. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలు మానసిక ఆనందం కలిగిస్తాయి. అందుకే ప్రతి ఒక్కరూ తెలుగు భాషపై పట్టు సాధించాలి” అని విద్యార్థులను ప్రోత్సహించారు.క్రీడా పోటీలు, తెలుగు భాష వక్తృత్వ–రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు మెడల్స్‌ను ఉపాధ్యా యులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కేవీ సత్యనారాయణమూర్తి, తెలుగు ఉపాధ్యాయులు పి.సునీత,జనార్ధన స్వామి,ఉపాసన, గాయత్రి, పీఈటి ఉమ, స్టాఫ్ సెక్రటరీ విస్సు మరియు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సతీష్ బాబు కార్యాలయంలో ప్రజా దర్బార్



**కాకినాడ, ఆగస్టు 29 పెన్ పవర్:** ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కొవ్వూరంలోని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయంలో శుక్రవారం 19వ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు.కార్యాలయం ఇన్‌చార్జ్ మేకా లక్ష్మణమూర్తి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పింఛన్లు, విద్య, ఇళ్ల స్థలాలు, ఉపాధి, వైద్యం వంటి అంశాలకు సంబంధించిన 30 అర్జీలు స్వీకరించగా,వాటిలో 5 అర్జీలను తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కార వేదికగా ప్రజా దర్బార్‌ను నిర్వహించడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. "ఎంపీ కార్యాలయానికి వస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది. సతీష్ బాబు ఏర్పాటు చేసిన టీమ్ సమర్థవంతంగా పనిచేస్తోంది" అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆనంద్ న్యూటన్, చింతపల్లి అర్జున్, జున్నూరు బాబ్జి, డీఆర్‌యూసీసీ సభ్యులు అనిల్, కాకరపల్లి చలపతిరావు, కరప మాజీ ఎంపీపీ సీతామాలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యా బ్యాంక్ ద్వారా విద్యా సామాగ్రి పంపిణీ



**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 29:** మండలం ర్యాలి గ్రామంలో అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో "అను విద్యా బ్యాంక్" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ శేఖర్, జె. రవి శేఖర్, సతీష్ లు సమకూర్చిన పలకలు, పుస్తకాలు, పెన్నులు, స్టేషనరీ వంటి సహస్ర విద్యా సామాగ్రిని సంస్థ నిర్వాహకులు డాక్టర్ మోహిత్ సీతలు ప్రభుత్వ పాఠశాలల చిన్నారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామలక్ష్మి, శ్యాం కుమార్, స్వాతి, సుధాకర్, సూరిబాబు, అలాగే పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని చిన్నారులకు విద్యా ప్రోత్సాహాన్ని అందించారు. రాబోయే రోజుల్లో కూడా విద్యా అభివృద్ధి కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని నిర్వాహకులు తెలిపారు.

## కుడుపూరులో కొట్లాట కేసులో నిందితుడికి జైలు శిక్ష.

**కె గంగవరం పెన్ పవర్ ఆగస్టు 29:** కే గంగవరం మండలం కుడుపూరు గ్రామంలో గత సంవత్సరం చోటుచేసుకున్న కొట్లాట కేసులో నిందితుడికి జైలు శిక్ష పడింది.వివరాల్లోకి వెళ్తే, 2024 జూన్ 4న పోలిశెట్టి వెంకటరమణ తన కుమారుడు మనోహర్ బైక్ విషయమై పొరుగు వ్యక్తి కనకాల వీరబాబు వద్దకు వెళ్లగా ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో వీరబాబు కర్రతో వెంకటరమణపై దాడి చేసి గాయపరిచాడు. రక్త గాయాలతో బాధపడిన వెంకటరమణ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఎస్‌కే జానీ భాషా కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు.తరువాత కోర్టులో అభియోగపత్రం దాఖలు చేయగా, కేసును విచారించిన రామచంద్రపురం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎన్. శారద శుక్రవారం తీర్పు వెలువరించారు. ఇందులో నిందితుడు కనకాల వీరబాబుకు

ఒక సంవత్సర జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించారు.ఈ కేసులో ఏపీపీ రామతులసి వాదనలు వినిపించారు. రామచంద్రపురం డీఎస్పీ బి. రఘువీర్, సీఐ వెంకటనారాయణ, పామర్రు ఎస్సై ఎస్‌కే జానీ భాషా బృందాన్ని అభినందించారు.

## కుడుపూరులో కోడిపందాలపై దాడి- ఐదుగురు అరెస్ట్.

**కె గంగవరం పెన్ పవర్ ఆగస్టు 29:** కే. గంగవరం మండలంలోని కుడుపూరు గ్రామంలో కోడిపందాలపై పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు.ఈ విషయాన్ని పామర్రు ఎస్సై ఎస్‌కే జానీ బాషా వెల్లడించారు. గ్రామంలో కోడిపందాలు జరుగుతున్న సమాచారం అందడంతో గురువారం సిబ్బందితో కలిసి దాడి నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రెండు కోడిపుంజులు, రూ.5,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఎస్సై జానీ బాషా తెలిపారు.

## మండలంలో రోడ్లు ప్రమాదకరంగామారాయి

**సిపిఎం జిల్లా కమిటీ నాయకులు గుడెల్లి వెంకటరావు**



**టీ నర్సాపురం, పెన్ పవర్, ఆగస్టు 29 :** మండలంలో రోడ్ల పరిస్థితి దుర్భరంగా ఉందని సిపిఎం జిల్లా కమిటీ నాయకులు గుడెల్లి వెంకటరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పత్రికను ఉద్దేశించి మాట్లాడుతూ లక్ష్మీపురం నుంచి టీ నరసాపురం వరకు వచ్చే రోడ్డు పూర్తిగా పాడైపోయిందని వాహనదారులు రోడ్డుపై వాహనాలు నడపటానికి తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.గత మూడు నెలల క్రితం రిపేర్ చేసిన రోడ్లు కూడా నాణ్యత లోపంతో ఇబ్బందికరంగా మారాయని వాహనాలు పడిపోయే పరిస్థితి నెలకొందని అధికారులు ఎమ్మెల్యే స్పందించి రోడ్ల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ప్రమాదకరంగా మారిన రోడ్లను కనీసం గుంటలు అన్న పూడ్చే కార్యక్రమం చేపట్టాలని ఆయన కోరారు.

## జగ్గంపేట భాష్యం స్కూల్లో తెలుగు భాష,

# జాతీయ క్రీడా దినోత్సవం





**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 29:** స్థానిక రావులమ్మ నగర్ లోని భాష్యం పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం మరియు జాతీయ క్రీడ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటగా గిడుగు రామ్మూర్తి పంతులు మరియు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. దేశంలో 22 అధికారిక గుర్తింపు కలిగిన భాషల్లో తెలుగు ఒకటన్నారు. హిందీ, బెంగాలీ భాషల తర్వాత దేశంలో ఎక్కువగా మాట్లాడుకునే భాష తెలుగు అని తెలియజేశారు. తెలుగు కవి గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 29వ తేదీన తెలుగు భాష దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. భారత హాకీ క్రీడాకారుడైన ధ్యాన్ చంద్ గౌరవ సూచికంగా ఆయన పుట్టినరోజు అయిన ఆగస్టు 29వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవం గా జరుపుకుంటున్నామన్నారు. ఒలింపిక్స్ క్రీడల్లో మన దేశానికి మూడు బంగారు పథకాలు అందించిన గొప్ప క్రీడాకారుడు అన్నారు. మనదేశంలో హాకీ క్రీడకు ఆద్యుడుగా ధ్యాన్ చంద్ ను అభివర్ణిస్తుంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్చార్జ్ గోవిందరాజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపాల్ వాణి, తెలుగు ఉపాధ్యాయులు బాలాజీ రావు,రేవతి, వ్యాయామ ఉపాధ్యాయులు రవినాగ్ పాల్గొన్నారు.

## ఫుడ్ ప్రాసెసింగ్ అవగాహన సదస్సు

**స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన సదస్సు**





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 29:** ఆత్రేయపురం మండల కార్యాలయంలో శుక్రవారం ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పూతరేకులు తయారు చేసే మహిళలు, ఆహార ఉత్పత్తులు తయారు చేసే మహిళలకు ప్రత్యేకంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. నూతన సాంకేతిక పద్ధతుల ద్వారా ఎలక్ట్రానిక్ మిషన్ సహాయంతో పూతరేకు తయారీ విధానాన్ని ప్రత్యక్ష ప్రదర్శన (డెమో) ద్వారా చూపించారు. మహిళలు ఆధునిక యంత్రాల వినియోగం ద్వారా సమయాన్ని ఆదా చేసుకోవడంతో పాటు ఆదాయాన్ని పెంచుకోవచ్చని నిపుణులు వివరించారు.ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్, ఆత్రేయపురం స్టేట్ బ్యాంక్ మేనేజర్ బొజ్జ ప్రవీణ్ కుమార్, ఫుడ్ ప్రాసెసింగ్ జోనల్ మేనేజర్ మారుతి, ర్యాలీ బ్యాంక్ మేనేజర్ వెంకట నరసింహ, ఫుడ్ ప్రాసెసింగ్ డిఆర్పి ఈశ్వర్, రమ్య పాల్గొని మహిళలకు ప్రోత్సాహం అందించారు. ఈ అవగాహన సదస్సు ద్వారా గ్రామీణ మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## ఎమ్మెల్యే ముప్పిడి ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహణ



**కొవ్వూరు, పెన్ పవర్, ఆగస్ట్ 29:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అదేశాల మేరకు ప్రతి శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్ లో భాగంగా కొవ్వూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో పాల్గొన్న కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు. కార్యక్రమంలో భాగంగా ప్రజలు నుండి వినతి పత్రాలు స్వీకరించారు. అదేవిధంగా వారి సమస్యలను నేరుగా ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలు సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి పరిష్కార మార్గాన్ని చూపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల నుండి12 వినతి పత్రాలు అందాయని అన్నారు. హెల్త్ పింఛన్లు ఇప్పించాలని, రెవిన్యూ సమస్యలు, తిరుగుడుమెట్ట గ్రామానికి బస్ సర్వీసులు నడపాలని కోరుతూ తదితర వినతి పత్రాలను వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాషను ప్రోత్సహించాలి



**జీలుగుమిల్లి, పెన్ పవర్ ,ఆగస్టు 29 :** తెలుగు భాష సంస్కృతిని కాపాడి భవిష్యత్తు తరాల కోసం కృషి చేయాలని అరసం రాష్ట్ర కార్యదర్శి బి ఎన్ సాగర్ సూచించారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమాన్ని ములుగులంపల్లిలో అరసం ఏలూరు జిల్లా శాఖ, పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచీకరణ ప్రైవేటీకరణ నేపథ్యంలో వివిధ భాషల సంస్కృతులు కొట్టుకుపోతున్నాయి అని అన్నారు. ప్రస్తుతం తెలుగు మాట్లాడితే వాడు అనాగరికడిగా నిద్ర వేయడం తగదని అన్నారు. తెలుగు భాషా సంస్కృతిని పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రసిద్ధ హాకీ క్రీడాకారుడు ధ్యానాచంద్ జీవిత విశేషాలను వివరించారు .అనంతరం విద్యార్థిని విద్యార్థులు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి ప్రసాదు, సిహెచ్ సత్యనారాయణ, ధర్మల రాజు, తాటి ఎల్లప్ప, తాతా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్‌లో ఉద్యోగులకు పదోన్నతులు



**కాకినాడ, ఆగస్టు 29 పెన్ పవర్:** జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు మంజూరయ్యాయి. జిల్లా ప్రజా పరిషత్ గౌరవ ఛైర్‌పర్సన్ విప్పర్తి వేణుగోపాల రావు శుక్రవారం ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లనుపరిపాలనాధికారులుగా, మరో 18 మంది ఆఫీసు సబార్డినేట్‌లను రికార్డ్ అసిస్టెంట్లు గా పదోన్నతి కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.వి.వి.ఎస్. లక్ష్మణరావు, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి జి.ఎస్. రామ్ గోపాల్, ఏపీపీఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.వి. రమేష్ పాల్గొన్నారు.

## జక్కంపూడి రాజాను కలిసిన తోట



**తాళ్ళపూడి, పెన్ పవర్, ఆగస్ట్ 29:** వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజాని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన తూర్పుగోదావరి జిల్లా మాజీ ప్రచార కమిటీ అధ్యక్షులు తోట రామకృష్ణ. అనంతరం శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి, వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్సీపీ కొవ్వూరు మండల మాజీ అధ్యక్షులు సుంకర సత్యనారాయణ, కొవ్వూరు టౌన్ అధ్యక్షులు చిట్టూరి అన్నవరం, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షులు ఇంటి వీర్రాజు తదితరులు సన్మాన కార్యక్రమంలో ఉన్నారు.

# పోటీ చేయని రాజకీయ ప్రతినిధులు సెప్టెంబర్ 8న విచారణకు హాజరు కావాలి





**అమలాపురం. పెన్ పవర్ ఆగస్టు 29:** జిల్లావ్యాప్తంగా గుర్తింపు పొందని రాజకీయ పార్టీలు 2019 నుండి గత 6 సంవత్సరాలుగా ఒక్క ఎన్నికలో కూడా పోటీచేయనీ రాజకీయ పార్టీల ప్రతినిధులు సెప్టెంబర్ 8వ తేదీ అమరావతిలో నిర్వహించే సమావేశంలో విచారణకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రక టనలో పేర్కొన్నారు .జై సమైక్య ఆంధ్ర పార్టీ జిల్లాలో ఒక్క ఎన్ని కలో కూడా ఈ 6 సంవత్సరాల కాలంలో పోటీ చేయలేదన్నారు. ఈ పార్టీ విచారణ తేదీని సెప్టెంబర్ 8 న ఉదయం 11:40 గంటలకు షెడ్యూల్ చేసినట్లు తెలిపారు. అటువంటి విచారణకు అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి,పార్టీ అధిపతి తప్పని సరిగా హాజరు కావాలనీ పైన పేర్కొన్న తేదీ నాటికి పార్టీ నుండి ఎటు వంటి సమాధానం రాకపోతే,ఈ విషయంలో పార్టీకి ఏమీ చెప్పడానికి లేదని భావించబడుతుందన్నారు. పార్టీకి తదుపరి సమాచారం లేకుండా తగిన చర్య తీసుకోబడుతుం దన్నారు. కావున జిల్లాలోని గుర్తింపు పొందని ఆరు సంవత్సరాలుగా ఎటువంటి ఎన్నికల పోటీలో పాల్గొనని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ విషయాన్ని గుర్తించాలని ఆయన ప్రకటనలో సూచించారు.

## నత్త నడకన హౌసింగ్ కాలనీల నిర్మాణం

- బిల్లులు చెల్లించక పోవడమే కారణమా?



**వై రామవరం, పెన్ పవర్,ఆగస్టు 29 :** మండలంలో జన్ మన్ పథకం ద్వారా మంజూరైన హౌసింగ్ కాలనీల నిర్మాణాలు నత్త నడకన సాగుతున్నాయని, దీనికి కారణం సకాలంలో బిల్లులు రాకపోవడమేనని లబ్ధిదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా జన్ మన్ పథకం లో కొండ రెడ్లకు1145 హౌసింగ్ కాలనీలు మంజూరు అయ్యాయని హౌసింగ్ సిబ్బంది తెలిపారు. ఇప్పటివరకు 780 ఇండ్లు నిర్మాణాలు ప్రారంభం అయ్యాయని తెలిపారు. 365 ఇండ్లు నేటికీ ప్రారంభించలేదని అన్నారు. పునాది లెవెల్లో 358 ఇండ్లు, రూఫ్ లెవెల్ 347 ఇండ్లు, స్లాబ్ లెవెల్ 50 ఇండ్లు ఉండగా ఇప్పటివరకు 25 ఇండ్ల నిర్మాణం పూర్తయిందని హౌసింగ్ అధికారులు తెలిపారు.

## సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తా ఎమ్మెల్సీ అనంత. ఉదయభాస్కర్..



**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్ట్ 29:** శుక్రవారం ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ తన స్వగ్రామమైన ఎల్లవరం గ్రామంలో గ్రీవెన్స్ నిర్వహించారు. రంపచోడవరం నియోజకవర్గం వైఎస్ఆర్ సిపి నాయకులు, కార్యకర్తలు,ప్రజలు హాజరయ్యారు. ఎమ్మెల్సీ అనంత. ఉదయ భాస్కర్ దృష్టికి ప్రజలు కొన్ని సమస్యలు తీసుకొచ్చారు, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారాన్ని కృషి చేస్తామని ఉదయ భాస్కర్ హామీ ఇచ్చారు.

## గణేష్ ఉత్సవాల జాగ్రత్తలపై సమావేశం నిర్వహించిన తహాశీల్దార్ లక్ష్మీ లావణ్య



**తాళ్ళపూడి, పెన్ పవర్, ఆగస్ట్ 29:**వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలు, పందిళ్ళు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై తహసిల్దార్ లక్ష్మి లావణ్య, ఎంపిడిఓ, ఎస్.హెచ్.ఓ, విఆర్వోలు, పంచాయతీ కార్యదర్శిలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవ కమిటీ వారు వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమం త్వరగా ప్రారంభించాలని, నిమజ్జనం రోజు రాత్రి 6.00 గంటల లోగా పూర్తి చేయాలి అని, నిమజ్జనం అనుమతి ఇచ్చిన గోదావరి ఘాట్స్ వద్ద మాత్రమే చేయాలి అని పేర్కొన్నారు. ఎవరు కూడా గోదావరి నది లోనికి వెళ్లకూడదు అని, ప్రస్తుతం గోదావరి వరద ఉధృతి ఎక్కువ ఉన్నందున వినాయక విగ్రహ నిమజ్జనం కొరకు తక్కువ మంది నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు. గోదావరి నది పరివాహక ప్రాంతములో గజ ఈతగాళ్లు, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బందిని గస్తీ నియమించామని చెప్పారు. నిమజ్జనం విషయంలో ఎవరికి అయిన ఏవిధమైన ఇబ్బందులు ఉన్న ప్రభుత్వ కార్యాలయాలలో సంప్రదించాలి అని తెలియజేశారు.

## ఆది కర్మయోగి అభియాన్ శిక్షణ కార్యక్రమం



**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఆగస్టు 29:** ప్రజా సమస్యలను సమయాన కూలంగా సానుభూతితో పారదర్శకంగా పరిష్కరించాలని ఎంపీడీవో నిఖిల్ మధు శరన్ సూచించారు. శు క్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆది కర్మయోగి అభియాన్ రెండవ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ విభాగాల సిబ్బందికి ప్రతి స్పందనాత్మక పాలన, సేవాభావం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామాలలో ఉండే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ,అధికారులు పాల్గొన్నారు.

## నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం





**కాకినాడ, ఆగస్టు 29, పెన్ పవర్:**నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా కాకినాడ %ఇూాణ% ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఫర్ ఉమెన్స్ లో విద్యార్థులు, తల్లిదండ్రులకు ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ వాడకం, ఈవ్ టీసింగ్ మరియు సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ వన్ ఇన్స్పెక్టర్ ఎన్. రమేష్ మాట్లాడుతూ %-% ప్రతి ఒక్కరూ ఆటలలో పాల్గొనడం వలన శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు విద్యా ప్రగతికి కూడా తోడ్పడుతుందని అన్నారు. మోటార్ సైకిల్ నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ వలన ప్రమాదాలు జరుగుతాయని విద్యార్థులకు వివరించారు. అలాగే జీబ్రా లైన్ లేని ప్రదేశాల్లో రోడ్డు ఎలా దాటాలి, ఆటోలు, బస్సుల్లో ప్రయాణించే సమయంలో పాటించవలసిన జాగ్రత్తలు వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక వేగం వలన కలిగే ప్రమాదాలను విద్యార్థులు గమనించాలని సూచించారు. సైబర్ నేరాల విషయంలో ఆన్లైన్ మోసాలు, ఫేక్ లోన్స్, నకిలీ ఆన్లైన్ జాబ్స్, డిజిటల్ అరెస్టులు వంటి వాటి గురించి అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో 112, 1930, 1972 హెల్ప్‌లైన్ నంబర్ల ఉపయోగం గురించి కూడా వివరించారు.

ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షుడు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగు భాష దినోత్సవ వేడుకలు







**అమలాపురం. పెన్ పవర్ ఆగస్టు 29:** విద్యానిధి పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా చైర్మన్ ఎ.బి.నాయుడు తెలుగు భాషా గొప్పతనాన్ని గూర్చి చక్కగా తెలియపరిచారు. విద్యార్థులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని చక్కటి ప్రసంగాలు,వేషధారణలతో, పాటలు, నృత్యాలతో తెలుగుభాష ఔన్నత్యాన్ని చాటే విధంగా తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్యామల మహాలక్ష్మి , ప్రిన్సిపల్ మాధవి ,ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బివిసి అక్సర్ జూనియర్ కాలేజ్ ప్రషర్స్ డే వేడుకలు





**అమలాపురం. పెన్ పవర్ ఆగస్టు 29 :**2025 లో అమలాపురం నగరం నందు ప్రారంభం అయిన బీవీసీ అక్సర్ జూనియర్ కాలేజ్ ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులను స్వాగతిస్తూ ఆగస్టు 29న ' పరిచయ '( ప్రషర్స్ డే ) ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేదిక ద్వారా కొత్త విద్యార్థులకు కళాశాల వాతావరణాన్ని మరియు స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యమని తెలియజేశారు. విద్యార్థులు తమ సాంస్కృతిక కార్యక్రమాలు, వినోదాత్మక ప్రదర్శనలతో అలరించారు. సంస్థ ఛైర్మన్ బోనం కనకయ్య విచ్చేసి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని అభివృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ మరియు కరెస్పాండెంట్ బోనం కృష్ణ సతీష్, బోనం విజయలక్ష్మి, బండిగుప్తాపు పాండురంగ పాల్గొని విద్యార్థులు పోటీపరీక్షలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించాలని ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమం డీన్, ప్రిన్సిపల్ అడబాల దుర్గారావు, ఫిజిక్స్ హెడ్ భీమాన జానకిరామ్ మరియు కెమిస్ట్రీ హెడ్ కటకం రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది.

## జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు మూడు నెలలు పొడిగింపు

**కాకినాడ, ఆగస్టు 29 పెన్ పవర్:** రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో వాటి కాలపరిమితిని మూడు నెలలపాటు పొడిగించి నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు కాకినాడ జిల్లా డిఐపీఆర్వో డి. నాగార్జున శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఆగస్టు 31, 2025 వరకు వాలిడిటీ ఉన్న కార్డులు కలిగిన జర్నలిస్టులకు మాత్రమే ఈ పొడిగింపు వర్తిస్తుందని, సెప్టెంబర్ 1, 2025 నుండి నవంబర్ 30, 2025 వరకు లేదా కొత్త కార్డులు జారీ చేసే వరకు ఏది ముందుగా జరిగితే అది వర్తిస్తుందని వివరించారు. అలాగే సంబంధిత మీడియా సంస్థలు తమ వద్ద పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలు, తొలగించిన జర్నలిస్టుల సమాచారం తప్పనిసరిగా ఆగస్టు 31 సాయంత్రం లోగా జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయానికి అందజేయాలని సూచించారు.

# మోసానికి చిరునామా కూటమి పాలన






● వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరి బాబు

**శంఖవరం, పెన్ పవర్, ఆగస్టు 29:** అధికారాన్ని చేపట్టేందుకే సూపర్ సిక్స్ పేరిట కూటమి పాలన అమల కాని హామీలు ఇచ్చి ప్రజలను నయవంచనకు గురి చేసిందని వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ధ్వజమెత్తారు. శుక్రవారం అన్నవరంలో రాఘవేంద్ర రెసిడెన్సీలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ నరాల శ్రీను అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరి బాబు మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామ, బూత్ కమిటీల ఎంపిక తో పాటు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహించాలన్నారు. జగనన్న పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరిందని కూటమిపాలనలో బడుగు బలహీన వర్గాలకు ఏ లబ్ధి దక్కటం లేదని గిరి బాబు అన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం క్యూ ఆర్ కోడ్ ను వైసీపీ నాయకులు ఆధ్వర్యంలో గిరిబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, జడ్పిటిసి ఈగల అప్పారావు , సరమర్ల మధుబాబు, అడపా సోమేష్, సకురు గుర్రాజు, దడాల సతీష్ బొట్టా చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

## మాతృభాష తల్లిపాల వంటిది-ప్రిన్సిపాల్ సుజని





**గోపాలపురం,పెన్ పవర్ ఆగస్టు 29:** మాతృభాష తల్లి వంటిదని ప్రతి ఒక్కరూ గౌరవించాలని గోపాలపురం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగతోట సుజిని అన్నారు.కళాశాల ఆవరణలో శుక్రవారం గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని మాతృభాష దినోత్సవాన్ని అలాగే ధ్యాన్చంద్ జయంతిని పురస్కరించుకుని క్రీడా దినోత్సవం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపల్ మాట్లాడారు.అనంతరం మండల విద్యాశాఖ అధికారి ఏ.ఉమామహేశ్వరరావు మాతృభాష యొక్క గొప్పతనాన్ని వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు,దేశభక్తి గీతాలు,మాతృభాషను ఉద్దేశించి పాడిన పాటలు చూపర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి.అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్చార్జ్ ప్రిన్సిపల్,తెలుగు అధ్యాపకులు గోవాడ జాన్ పీటర్ అధ్వర్యంలో మాతృభాష దినోత్సవ వేడుకలు నిర్వహించారు.తెలుగు భాష యొక్క ఉన్నత్యాన్ని తెలుగు భాష పుట్టుక పూర్వత్రాలు వంటి విషయాలను విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గాంధీ,రత్నకుమారి,భవాని,శ్రీనివాస్,ఎన్.రాజేశ్వరి,పీ.సునీత,వి.శివశ్రీ,గౌతమి,ఉపాధ్యాయులు,సిఆర్పి నాగరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

# కొలువుతీరిన బాల గణనాథుడు మండపాల వద్ద సందడి



**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు 29:** సీతానగరం మండలంలోని సింగవరం గ్రామంలో వినాయక చవితి వేడుకలు అంబరాన్నంటాయి. మండపాలకు వివిధ రూపాల్లో ఉన్న గణనాథులను డబ్బు చప్పుళ్ళు మంగళ వాయిద్యాల మధ్య తరలించి ప్రతిష్టించారు. ఈ సందర్భంలో గ్రామంలో గణేష్ ఉత్సవాలు కోలాహలం మొదలైంది. తొమ్మిదిరోజుపాటు విశేష పూజలు అందుకునే లంబోదరుడు మండపాల్లో కొలువుదీరాడు. ఊరు వాడ వినాయక చవితి నెలకొంది. కొలువైన గణనాథునికి ప్రతి ఒక్కరూ పూజలు నిర్వహించారు. కమీటి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలతో భజనలు సందడితో నెలకొంది.

## అందరూ చదువుకోవాలి-వెంకట్రావు రెడ్డి






**గోపాలపురం,పెన్ పవర్ ఆగస్టు 29 :**ప్రతి ఒక్కరూ విద్యావంతులై తద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి వెంకట్రావు రెడ్డి అన్నారు.స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో శుక్రవారం ఉల్లాస్ అక్షరాంధ్ర అనే కార్యక్రమం నిర్వహించారు.ఎంపీడీవో రాజ్ మనోహర్ అధ్యక్షతన వాలంటీర్లకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నోడల్ అధికారి మాట్లాడుతూ మండలంలో డ్వాక్రా,డ్వామా సంఘాల సభ్యుల్లో 3300 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు.ప్రతి పదిమంది నిరక్షరాస్యులకు ఒక వాలంటీర్ ని ఏర్పాటు చేసి వయోజనులకు విద్యను అందించడం జరుగుతుందన్నారు.మండలంలో 330 మంది వాలంటీర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.పశ్చిమగోదావరి జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి కెవివి సత్యనారాయణ మాట్లాడుతూ సెప్టెంబర్ నెల నుండి జిల్లా అంతట అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.వాలంటీర్లకు డిజిటల్ లిటరసీ,ఫైనాన్షియల్ లిట్రసి వంటి వాటిపై తర్ఫీదు ఇవ్వడం జరిగిందన్నారు.శిక్షణ అనంతరం మార్చి నెల ఆఖరున పరీక్ష ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ఏపిఎం డ్వామా ఏపీవో క్లస్టర్ కోఆర్డినేటర్లు,తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కులాల అభ్యర్థులకు హెవీ మోటార్ వెహికల్ ఉచిత శిక్షణ

**అమలాపురం పెన్ పవర్ఆగస్టు 29:**ఎస్సీ కులాలకు చెందిన అభ్యర్థులకు హెవీ మోటార్ వెహికల్ హెచ్ ఎం వి ఉచితశిక్షణ ఇవ్వడం జరుగు తుందనీ ఎస్సీకార్పొరేషన్ ఎగ్జి క్యూటివ్ డైరెక్టర్ జె సత్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. దర ఖాస్తు చేసుకునేందుకు స్త్రీలు దరఖాస్తు చేయనందున దరఖాస్తులు గడువు తేదీని సెప్టెంబరు 5 వ తేదీ వరకు పెంచారన్నారు. .డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన షెడ్యూల్ కులాలకు చెందిన,5మంది స్త్రీలకు హెవీ మోటార్ వెహికల్ హెచ్ ఎం వి ఉచిత శిక్షణ కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు, ఆ మేరకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 5 మంది స్త్రీ అభ్యర్థు లకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యాలను కేటాయించిందని జిల్లా షెడ్యూల్డ్ కులముల సహకార సంఘం లిమిటెడ్ కార్యని ర్వాహక సంచాలకులు జె. సత్యవతి తెలియచేశారు.ఆసక్తిగల షె డ్యూల్డ్ కులముల అభ్యర్థులు వయస్సు 20 సంవత్సరాల పైబడిన, కనీసం 1 సంవ త్సరం కాలపరిమితి గల లైట్ మోటార్ వెహికల్ ఎల్ ఎం వి లైసెన్స్ కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాల న్నారు.కోనసీమ జిల్లాకు చెందిన స్త్రీ అభ్యర్థుల గడువు తేదీని సెప్టెంబర్ 5 సాయంత్రం.5:00 గంటల వరకు పొడిగించినట్లు జె సత్యవతి తెలిపారు. కార్య నిర్వాహక సంచాలకులు, జిల్లా షెడ్యూల్డ్ కులముల సహకార సంఘం లిమిటెడ్, ప్రగతి భవన్, కాకినాడ – 533001 కు వారి దరఖా స్తులు సమర్పించవలసి సవినయముగా కోరారు. దరఖాస్తులో పొందపరచ వలసిన వివరాలు తెలుపుతూ అభ్యర్థి పేరు, తండ్రి/భర్త పేరు, పుట్టిన తేది/వయస్సు, విద్యార్హత (జెరాక్స్ కాపీ జత చేయాలి), ఆధార్ కార్డు నెం. జెరాక్స్ కాపీ జత చేయాల న్నారు, ఎల్ ఎం వి లైసెన్స్ బ్యాడ్జి నెం., ఎల్ ఎం వి లైసెన్స్ నెం. మరియు కాలపరిమితి జెరాక్స్ కాపీ జత చేయాలన్నారు. హెచ్ ఎం వి, ఎల్ ఆర్ నెం. కాలపరిమితి జెరాక్స్ కాపీ జత చేయా లనీ మొబైల్ నెం., చిరునామా పిన్ కోడ్ తో, ఏపీఎస్ఆర్టీసీ నియమా లకు అంగీకారం (అవును/కాదు) , కుల ధృవీకరణ పత్రం తప్పనిస రిగా జత చేయాలనీ కోరారు.అభ్యర్థి ఏపీఎస్ఆర్టీసీ నియమ నిబం ధనలకు అనుగుణంగా హెచ్ఎంవి శిక్షణ తీసుకోవడానికి తన వివరాలు సరైనవని, అంగీకరిస్తున్నట్లు సంతకం చేస్తూ స్వీయ ధ్రువీకరణ పత్రం అందచే యాలని తెలియ చేశారు. ఏమైనా అనుమానాలు సందేహాలు ఉన్నా, మరింత సమా చారం కోసం అసక్తి గల అభ్యర్థులు కార్యాలయపు సూపరింటెండెంట్ రాజు వారిని 6281817023 నందు సంప్రదిం చాలని ఆమె ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## 8 లక్షల రూపాయలతో మహాగణపతిని అలంకరణ.

**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 29,**కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం జగపతినగరం కొత్తపేట కాలనీలో గణేష్ అండ్ గద్వాల్ యూత్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహాగణపతిని సుమారు 8 లక్షల రూపాయలతో అలంకరించారు.ఈ సందర్భంగా గణేష్ అండ్ గద్వాల్ యూత్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం స్వామివారిని భక్తి శ్రద్దలతో పూజించి స్వామివారి కృప కటాక్షాలు గ్రామ ప్రజల మీద ఉండాలని కోరుకుంటున్నామన్నారు.ప్రతి సంవత్సరం స్వామివారి ఉత్సవాలు వైభవంగా జరిపించడం స్వామి వారి కరుణాకటాక్షాలతోనే అన్నారు.ఈ సంవత్సరం కూడా అన్ని కార్యక్రమాలు విజయవంతంగా పూర్తవ్వాలని స్వామివారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గణేష్ అండ్ గద్వాల్ యూత్ సభ్యులు,కొత్తపేట కాలనీ వాసులు పాల్గొన్నారు

## శక్తి యాప్ ను సద్వినియోగం చేసుకోవాలి



గంగవరం ఎస్సై వెంకటేష్

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 29:**మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి యాప్ ను మహిళలు అత్యవసర సమయాల్లో సద్వినియోగం చేసుకోవాలని గంగవరం సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు అవగాహన సదస్సును నిర్వహించారు. బాలికల రక్షణ కోసం శక్తి టీం లను పాఠశాల స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. బాలికలు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కలిగి ఉండాలని అవసరమైతే శక్తి టీమ్ల సహకారం తో ఉపాధ్యాయులను గాని పోలీసులు గాని ఆశ్రయించాలని సూచించారు. మహిళల బాలికల రక్షణ కోసం ఫోక్సో చట్టం ఉందని దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు బాలికలు అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నెంబర్ ను ఉపయోగించుకోవాలన్నారు.

## నిర్వాసితులను వెంటాడుతున్న గోదావరి,శబరి వరదలు






● రీ హాబిడేషన్ సెంటర్ ను సందర్శించిన పిఓ శు భం నొక్వాల్,ఏఎస్పి పంకజ్ కుమార్ మీనా

● భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు 29.**అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో గోదావరి,శబరి పరివాహక ప్రాంతాలలో వరద ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండడంతో చింతూరు ఐటీడీఏ పీవో శుభం నోక్వల్,ఏఎస్పి పంకజ్ కుమార్ మీనా టేకులబోరు నందు ఏర్పాటు చేసిన రీ హబిటేషన్ సెంటర్ ను సందర్శించారు.పిఓ మాట్లాడుతూ రిహాబిటేషన్ సెంటర్లో ఉన్నవారికి నిత్యవసర వస్తువులను అందించాలని మండల తాసిల్దార్ కే శ్రీనివాస్ తో అన్నారు.ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎవరు అధైర్యపడవద్దని అన్నారు.కూనవరం మండలంలో వరద ప్రభావానికి కొండ్రాజుపేట కాజ్ వే పై వరద నీరు ప్రవహిస్తుండడంతో సుమారు15 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి10 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావలసిన పరిస్థితి ఏర్పడింది.భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఉదయం 6 గం 35.20 అడుగులు వద్ద వరద ప్రవహిస్తు, సాయంత్రం 8 గం 43.30అడుగుల కు వరద చేరుకోవడంతో మొదటి ప్రమాద హెచ్చరిక అధికారులు జారీచేశారు.మండల కేంద్రంలోని భాస్కర కాలనీ,గిన్నెల బజార్,చేపల బజార్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ డి సి వెంకటేశ్వరరావు,మండల తాసిల్దార్ కే శ్రీనివాస్ అన్నారు. టేకులబోరు నందు ఏర్పాటు చేసిన రీ హేబిటేషన్ సెంటర్ కు ముందస్తుగా 145 కుటుంబాలను చేర్చి వారికి నిత్యవసర వస్తువులను, కొవ్వొత్తులను స్థానిక సర్పంచ్ హేమంత్ గాంధీ అందించారు. నిర్వాసిత ప్రజలను తరచూ వెంటాడుతున్న శబరీ,గోదావరి వరదలు.తరచూ పెరుగుతూ, తగ్గుతూ ప్రజలతో ఆటలాడుతుంది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జగన్నాథ రావు,ఎస్ ఐ లతాశ్రీ,ఆర్ ఐ చెల్లాయమ్మ,టిడిపి ప్రెసిడెంట్ బారపాటి ప్రకాష్,గడ్డిపాటి ప్రసాద్,దాసరి నరేంద్ర పాల్గొన్నారు.

# గంగవరంలో వాహనాల తనిఖీ




**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 29:**జాతీయ రహదారి లో ప్రమాదాల నివారణకై శుక్రవారం గంగవరం ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది విస్తృతంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. గంగవరం రంపచోడవరం ప్రధాన రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినట్లయితే ప్రమాదాలకు గురై కుటుంబాలు రోడ్డుపాలవుతాయని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించుకోవాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు .ఈ సందర్భంగా రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు జరిమానాలు విధించారు.

# మాతృభాష ను గౌరవించడం మన అందరి బాధ్యత : డా. డి సునీత.





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 29:** మాతృభాషను గౌరవించడం మన అందరి బాధ్యత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి సునీత అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో తెలుగు విభాగ ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు భాష యొక్క గొప్పతనం గూర్చి, గిడుగు వెంకట రామమూర్తి తెలుగు భాష కు చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. దక్షిణ భారతదేశంలో మాట్లాడే ద్రవిడ భాషల్లో అన్నిట్లోకి తెలుగు భాష ను ఎక్కువగా మాట్లాడతారు అన్నారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రాజ భాష. "త్రిలింగ" పదము నుంచి "తెలుగు" పదం వెలువడిందని , తేనె వంటిది కనుక "తెనుగు" అంటారని . తెన్ అంటే దక్షిణము,దక్షిణ దిక్కు నకు చెందిన భాష తెనుగు,అదే తెలుగు గా మారిందని, క్రీస్తు పూర్వం 400 నాటి శిథిలాలలో తెలుగు భాష ఉండడాన్ని బట్టి తెలుగు చాలా ప్రాచీన భాష అని, తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న తెలుగు కవి , వ్యావహారిక భాషా ఉద్యమ నాయకుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా జరుపుకుంటామని అన్నారు. ఆయన భాషను గ్రాంధికం నుంచి ప్రజలు మాట్లాడే వాడుక భాషలోకి మార్చడానికి ఎంతగానో కృషి చేశారని, ఈ భాషా దినోత్సవం తెలుగు భాషకు ఆయన చేసిన సేవలను గౌరవించడానికి, భాషను ప్రోత్సహించడానికి, తెలుగు ప్రజలలో భాషా చైతన్యాన్ని పెంపొందించడానికి అంకితం చేయబడుతుందని అన్నారు. పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్, హిందీ భాషలు తప్పకుండా నేర్చుకోవాలని గాని తెలుగు భాషకు అధిక ప్రాదాన్యత ఇవ్వాలని, తెలుగులో సంభాషించాలని, భావి తరాలకు తెలుగు భాషను అందించేందుకు వారదులుగా ఉంటూ తెలుగు గొప్పతనాన్ని, ఔనత్యాన్ని కాపాడుతూ తెలుగు భాష పై పట్టు సాదించాలని విద్యార్థులకు కోరారు. తెలుగు విభాగ అధ్యాపకులు పుష్ప తెలుగు భాష ప్రాదాన్యత, గొప్పతనం గూర్చి తెలియజేసారు . క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు హేమ వేంకట దుర్గా కు ప్రథమ బహుమతి, నవీన్ కు ద్వితీయ బహుమతి, సి చరణ్ కు తృతీయ బహుమతి ప్రిన్సిపల్ అందజేశారు. ఈ కార్యక్రమలో వైస్ ప్రిన్సిపాల్ కె. వెంకటేశ్వర రావు , ఎం ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి డా. ప్రయాగ మూర్తి ప్రగడ, అధ్యాపకులు వి. రామ రావు, కె సురేష్, డా శివ ప్రసాద్, డా మదీనా, శ్రీలక్ష్మి, డా వీరభద్ర రావు, డా బంగార్రాజు,కుమారి రోజలిన , సతిష్, రాజేష్ కళాశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.





## 8 లక్షల రూపాయలతో మహాగణపతిని అలంకరణ.





**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 29,**కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం జగపతినగరం కొత్తపేట కాలనీలో గణేష్ అండ్ గద్వాల్ యూత్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి మహొత్సవాల్లో భాగంగా శుక్రవారం మహాగణపతిని సుమారు 8 లక్షల రూపాయలతో అలంకరించారు.ఈ సందర్భంగా గణేష్ అండ్ గద్వాల్ యూత్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం స్వామివారిని భక్తి శ్రద్దలతో పూజించి స్వామివారి కృప కటాక్షాలు గ్రామ ప్రజల మీద ఉండాలని కోరుకుంటున్నామన్నారు.ప్రతి సంవత్సరం స్వామివారి ఉత్సవాలు వైభవంగా జరిపించడం స్వామి వారి కరుణాకటాక్షాలతోనే అన్నారు.ఈ సంవత్సరం కూడా అన్ని కార్యక్రమాలు విజయవంతంగా పూర్తవ్వాలని స్వామివారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గణేష్ అండ్ గద్వాల్ యూత్ సభ్యులు,కొత్తపేట కాలనీ వాసులు పాల్గొన్నారు

## అన్నదాన కార్యక్రమాన్ని భక్తులు జయప్రదం చేయాలి.

- శ్రీ దుర్గాభవాని ఆటో యూనియన్,ఆటోడ్రైవర్లు



**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.29**
మండలంలోని రేఖపల్లి,జంక్షన్,వద్ద శ్రీదుర్గాభవాని ఆటో యూనియన్,ఆటోడ్రైవర్లు,వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి,వినాయక గణపతికు ప్రతిరోజు నైవేద్యములు ఇస్తూ భజన పాటలతో ఘనంగా జరుపుకుంటున్నారు.రేఖపల్లి శ్రీ దుర్గాభవాని ఆటోయూనియన్,వారి ఆద్వర్యంలో 30వ. తారీకు శనివారం సాయంకాలం ఆరు గంటలనుండి అన్న దాన కార్యక్రమం జరుగును.ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని,జయప్రదం చేయాలని, రేఖపల్లి శ్రీ దుర్గాభవాని ఆటోయూనియన్,ఆటోడ్రైవర్లు, ప్రకటనలో భక్తులను కోరారు.ఈ కార్యక్రమంలో రేఖపల్లి శ్రీ దుర్గాభవాని ఆటో యూనియన్,ఆటోడ్రైవర్లు,భక్తులు తది తరులు పాల్గొన్నారు.

## నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి.

-వాలంటీర్ల శిక్షణా కార్యక్రమంలో ఎంపిడిఓ భావిశెట్టి హరికృష్ణ.





**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 29:** నిరక్షరాస్యత నూరు శాతం నిర్మూలనకు వాలంటీర్లతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఎంపీడీఓ, ఉల్లాస్ చైర్మన్ బావి శెట్టి హరికృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంమైన కిర్లంపూడి మండల పరిషత్ కార్యాలయపు సమావేశపు హాలులో అక్షర ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఉల్లాస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన 90 మంది నరేగా వాలంటీర్లకు, వెలుగు ఆధ్వర్యంలో ఎంపికైన 25 మంది వాలంటీర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బావిశెట్టి హరికృష్ణ మాట్లాడుతూ ఎంపికైన ప్రతి వాలంటీరు కనీసం 10 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రోగ్రాం మేనేజర్ శరకణం వేదకుమారి వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ నిరక్షరాస్యులను, అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు సులువైన పద్ధతులను వివరించడమే కాకుండా, చదువు రాని వారి పట్ల సదువుపై ఆసక్తి పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ సత్యప్రసాద్,ఎపిఓ నాయుడు, టిడిపి నాయకుడు గుడాల రాంబాబు వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడారు.

## గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించి, కనీస వేతనం 21 వేలు ఇవ్వాలి




**సీఐటీయూ**
**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 29:**గ్రామపంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని, మున్సిపల్ కార్మికులకు ఇస్తున్నట్లుగా కనీస వేతనం 21 వేల రూపాయలు ఇవ్వాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో చింతూరు గ్రామపంచాయతీ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో మాట్లాడుతూ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ రాష్ట్ర వ్యాప్తంగా 28 వేల మంది గ్రామపంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు పనిచేస్తున్నప్పటికీ, వారికి సమాన వేతనాలు చెల్లింపులో ప్రభుత్వం వివక్ష చూపుతోందని విమర్శించారు. ఒకే విధమైన పనిని చేస్తూ మున్సిపల్ కార్మికులు 21 వేల వేతనం పొందుతుంటే, గ్రామపంచాయతీ కార్మికులకు 6 వేలు నుండి 12 వేల వరకు మాత్రమే చెల్లిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లపు వెంకట్ మాట్లాడుతూ పెరిగిపోతున్న నిత్యావసర ధరల దృష్ట్యా వేతనాలు తక్షణమే పెంచాల్సిన అవసరం ఉందని, నెలలు తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉంచడం వల్ల కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పరిశుభ్రత కోసం కార్మికులు శ్రమిస్తుంటే, వారి కడుపు నింపుకునే వేతనాల చెల్లింపులో అధికారుల నిర్లక్ష్యం దారుణమని వ్యాఖ్యానించారు. అలాగే 551 జీవోను అమలు చేసి కార్మికులకు గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని, ప్రమాద బీమా 10 లక్షల రూపాయలు ఉండేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి గంగరాజుకు అందించారు. వేతనాలు త్వరగా చెల్లించే చర్యలు తీసుకుంటామని, మిగిలిన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించబడింది. ఈ కార్యక్రమంలో సీసం సురేష్, ముట్టం రాజయ్య, కారం నాగేష్, అలాగే పంచాయతీ కార్మికులు రాజమ్మ, రాములమ్మ, శారద, వెంకమ్మ, దుర్గ, మూర్తి, నాగరాజు, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేట నియోజకవర్గ సమస్యలపై హైకోర్టును ఆశ్రయించాం

**కాంగ్రెస్ ఇంచార్జ్ మరోతి శివ గణేష్**



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 29:** ప్రజా ప్రయోజనాలను విఘాతం కలిగించే, నష్టపరిహారం ఇవ్వవలసిన, అభివృద్ధి మరియు ఆధునీకరణకు నిధులు కేటాయించవలసిన ఐదు అంశాలపై ఆశ్రయించినట్లు జగ్గంపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ మరోతి శివ గణేష్ శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఏలేరు జలాశయం వరదల కారణంగా గత మూడు సంవత్సరముల నుండి నష్టపోయిన 67 వేల ఎకరాల రైతన్నలకు నష్టపరిహారం ఇవ్వాలని, ఏలేరు కాలువలను ఆధునీకరణకు 1000 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయాలని, రాజ్యలక్ష్మి మెరైన్ పరిశ్రమను వెంటనే మూయించాలని, ఆ పరిశ్రమకు పర్మిషన్లు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. జగ్గంపేట పంచాయతీలో నిర్మాణం చేసిన పరిశ్రమలను వాటి ఆపరేషన్ సస్పెండ్ చేసి పరిశ్రమలను మూయించి వేసి, అక్రమ పర్మిషన్లు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకుని ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. గండేపల్లి మండలం లోని ఎల్లమిల్లి గ్రామ పంచాయితీ పరిధిలో జట్టి గ్రానైట్స్ ను వెంటనే ఆపరేషన్స్ సస్పెండ్ చేసి క్రషర్ షట్ డౌన్ చేసి (ప్రజా హక్కులను, ప్రజా ఆరోగ్యాన్ని సంరక్షించి, అడ్డగోలు పరిమిషన్లు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకుని బాధితులకు నష్టపరిహారం ఇప్పించాలన్నారు. తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ లో నీరు రాక నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, గోకవరం మండలం గుమ్మల్ల దొడ్డి అస్సాగో పరిశ్రమ మూసివేయాలన్నారు. ఈ సమస్యలపై హైకోర్టులో వాదిస్తానని మరొక శివ గణేష్ పేర్కొన్నారు.

## రైల్వేలో రిటైర్ అయిన వారిని తిరిగి నియమించకూడదు : డివైఎఫ్ఐ




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 29 :**
రైల్వే బోర్డు తీసుకున్న రిటైర్ ఉద్యోగులను తిరిగి నియమించే నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు డీజిల్ లోకో షెడ్ వద్ద కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు.డివైఎఫ్ఐ జిల్లా అధ్య క్షుడు రాజు మాట్లాడుతూ, లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టులకు రిటైర్ అయిన వారిని తీసుకోవడం వల్ల యువతకు అవకాశా లు దూరమవుతున్నాయని, భద్రతా సమస్యలు పెరుగుతున్నాయని విమర్శించారు. ఇప్పటికే రైల్వేలో లక్షల సంఖ్యలో ఖాళీలు ఉన్నా ప్రభు త్వం నియామకాలు చేయడం లేదన్నారు.
హై లెవల్ కమిటీ సిఫార్సులను పట్టించుకోకుం డా రైల్వే బోర్డు తిరోగమన నిర్ణయాలు తీసుకుం టోందని, ఇది ప్రయాణీకుల భద్రతకు ప్రమాదక రమని పేర్కొన్నారు. ఖాళీలు భర్తీ చేసి, పైలట్లకు తగిన విశ్రాంతి, వారపు సెలవులు కల్పించాలని డిమాండ్ చేశారు.రిటైర్ ఉద్యోగులను తిరిగి నియమించే నిర్ణయం రద్దు చేయకపోతే తీవ్ర ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో బోలేనాథ్, చినబాబు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు

## గోతులుమయమైన ఉప్ప రోడ్డు మరమత్తు పనులు తక్షణమే ప్రారంభించాలి

- జై భీమ్ సేవా సంఘం నాయకులు
- పిట్ట నరేష్, సాగోరి రాధాకృష్ణ, కే బి వెంకట్, ఎస్ గిరిబాబు డిమాండ్







**పెన్ పవర్ హుకుంపేట ఆగస్టు29** హుకుంపేట మండలం కొట్నాపల్లి నుండి ఉప్ప వరకు గుంతలు పడ్డ రోడ్డు మరియు స్మశాన వాటికకు రోడ్డు మరియు వెంటనే మరమ్మతులు మరియు బ్రిడ్జి నిర్మాణం. చేయాలని శుక్రవారం. పాడేరు ఐ టి డి ఏ గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జై భీమ్ సేవా సంఘం నాయకులు పిట్ట నరేష్, కె బి వెంకట్, ఎస్ రాధాకృష్ణ, ఎస్ గిరిబాబు డిమాండ్ చేశారు

హుకుంపేట మండలం సుమారు 15 పంచాయితీల మీదుగా పంచాయితీ రాజ్ తారు రోడ్డు భారీ గుంతలు ఏర్పడడంతో మరమ్మత్తులకు నోచుకోక పోవడంతో రోడ్డు పూర్తిగా గుంతలు ఏర్పడ్డాయి దీంతో. 15 గ్రామ పంచాయతీల ప్రజలు మరియు ద్విచక్ర వాహందారులు మరియు ఆటోలు, ఆర్టీసీ బస్సు సైతం భారీ గుంతలకు చాలా ఇబ్బందులకు పోతున్నాయని అలాగే వాహనాలన్నీ పాడవుతున్నాయని , గర్భిణీ స్త్రీలకు మండల హెడ్ క్వార్టర్ ఆసుపత్రిలో తీసుకొని వెళుతున్న సమయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ రోడ్డు విషయంపై అనేకమార్లు అధికారులు విన్నవించినప్పటికీ ప్రయోజనం లేదని, కనుక తక్షణమే 15 పంచాయితీల ప్రజలకు ఉపయోగపడే తారు రోడ్డు (గుంతల రోడ్డును )ను మరమ్మత్తులు చేయాలని, మరియు స్మశాన వాటికకు రహదారి బ్రిడ్జి ఏర్పాటు చేయాలని శుక్రవారం కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. అధికారులు స్పందించి వెంటనే. రోడ్డు మరమ్మత్తులు పనులు చేయాలని అధికారులను కోరారు.

## మాజీ సర్పంచుకు శ్రద్ధాంజలి ఘటించిన ఎమ్మెల్యే ఎం. విశ్వేశ్వర రాజు





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 29:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం రింతాడ పంచాయతీకి చెందిన ఎబులం గ్రామ మాజీ సర్పంచ్ సాగిన రామారావు మరణించిన విషయం తెలిసిన వెంటనే, పాడేరు శాసన సభ్యులు మరియు వైసీపీ జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు శుక్రవారం ఎబులం గ్రామానికి చేరుకొని వారి పార్థివదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. మాజీ సర్పంచ్ సాగిన రామారావు గ్రామాభివృద్ధిలో ఎంతో కృషి చేసిన వ్యక్తిగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజుతో జీకే వీధి మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్,ఉపాధ్యక్షుడు వంతల అరుణ్ కుమార్,ప్రధాన కార్యదర్శులు వంతల చంటిబాబు, పాంగి చందర్ రావు,లక్కవరపు పేట సర్పంచ్ వీరేంద్ర ప్రసాద్,కో-ఆప్షన్ మెంబెర్ షేక్ దావుద్,జీకే వీధి మాజీ జడ్పీటీసీ మచ్చల మత్స్యరాజు,నాయకులు బాబీ,పాతూను లక్ష్మణ్,కంకిపాటి రామారావు,రమేష్,బూసారి కృష్ణరావు, గెమ్మెల జోగి రాజు, కంకిపాటి నారాయణ, సోబోయి రామూర్తి, పవన్, మార్క్, నూకరాజు, ఈశ్వర్, గిరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు






- ప్రధాన రహదారులపై నో పార్కింగ్ స్థలాలలో వాహనాలు నిలిపితే జరిమానా
- నో పార్కింగ్ జోన్ లపై దృష్టి సారించండి
- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

**పాడేరు, పెన్ పవర్,ఆగష్టు 29:** ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు, నో పార్కింగ్ జోన్ లపై దృష్టి సారించాలి, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి అని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అన్నారు.

రహదారి ప్రమాదాల నివారణకు అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జరిగిన రహదారి భద్రతా సమావేశంలో జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలపై ఆరా తీశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నో పార్కింగ్ జోన్ లపై దృష్టి సారించాలి, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రమాదాల సమాచార నివేదికలను ఎప్పటికప్పుడు అందించి కేసులు పరిష్కార చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి, వైద్య రవాణా తదితర శాఖలు పరస్పర సహకార సమన్వయంతో పని చేయాలని సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపడం నేరమని ప్రత్యేక తనిఖీలు ఏర్పాటు చేసి నివారించాలన్నారు.

నో పార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేయకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలి, సంతలలో పార్కింగ్ కి ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారుల్లో ప్రధాన రాదారుల్లో సంతలు జరుగుతున్నాయి వాటికి పంచాయతీ రాజ్, ఆర్అండ్ బి, పోలీస్, రెవిన్యూ, ట్రాన్స్పోర్ట్ శాఖలు సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ట్రాఫిక్ మేనేజ్మెంట్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక పోస్ట్ లు నిర్వహించి ప్రభుత్వ ఉద్యోగులు తప్పక హెల్మెట్ ధరించేలా చూడాలన్నారు. బస్సు షెల్టర్ కావలసిన చోటా ఏర్పాటు చేయాలని అలాగే సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

జాతీయ రహదారి పనులు జరుగున్నప్పటికీ తాత్కాలిక సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. రద్దీ ప్రదేశాలలో పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి పార్కింగ్ సమస్య నివారించాలని, అనధికార ప్రాంతాలలో పార్కింగ్ చేసిన వారికి జరిమానాలు విధించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో చింతపల్లి ఎఎస్పి నవ జ్యోతి మిశ్రా , జిల్లా రవాణాదికారి కెవి ప్రకాష్ రావు, జిల్లా రహదారులు భవనాల ఈఈ బాల సుందర బాబు, అదనపు వైద్య ఆరోగ్య అధికారి డా టి ప్రతాప్, పంచాయతీరాజ్ డిఈ జి. నరేన్ కుమార్, ఆర్టీసీ, జాతీయ రహదారుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గూడెం కాలనీ వినాయక మండపంలో భక్తిశ్రద్ధలతో అన్నసంతర్పణ కార్యక్రమం





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 29:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధిలోని గూడెం కాలనీ గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం శ్రీ శాంభరి దేవి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో గూడెం కాలనీతో పాటు గూడెం ఆర్.వి.నగర్, దేరాలు, నీలవరం, కొత్తగూడెం, ఎర్రవరం వంటి పలు గ్రామాల నుండి భక్తులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు భారీగా పాల్గొన్నారు. అన్నదానాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు భక్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం ప్రజా ప్రతిభ విలేకరి సాయం రమణ మరియు వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో నిర్వహించబడినది.గూడెం కాలనీ వినాయక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు.వినాయక చవితి ఉత్సవాలకు ఆర్థిక సహాయం అందించిన పసుపులేటి వినాయక రావు కుటుంబ సభ్యులను కమిటీ ప్రత్యేకంగా బహుమతులతో సత్కరించింది. అలాగే, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన సాయం రమణ కుటుంబాన్ని గ్రామ ప్రజలు, కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమం గూడెం కాలనీ వినాయక మండపాన్ని ఒక భక్తిశ్రద్ధల కేంద్రంగా మార్చింది. గ్రామ ప్రజల ఐక్యత, సహకారం వలన ఈ సేవా కార్యక్రమం విజయవంతమైందని నిర్వాహకులు తెలిపారు.

## మండల కేంద్ర వైన్ షాప్ సీజ్..?



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు29:** మండల కేంద్రంలోని రాజేంద్రపాలెంలో గల కులశేఖర్ వైన్స్ షాపును శుక్రవారం రాత్రి ఎక్సైజ్ శాఖకు చెందిన ప్రత్యేక స్క్వాడ్ సీజ్ చేశారు. ఎమ్మార్పీ ధరల కంటే మద్యాన్ని అధికంగా విక్రయిస్తున్నారన్న అభియోగం పైనా, అలాగే రికార్డులు ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించడం లేదన్న అభియోగంపైనా ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించిన ఎక్సైజ్ స్క్వాడ్ షాపును సీజ్ చేసినట్టు తెలుస్తోంది. కాగా వైన్ షాప్ ఆకస్మికంగా సీజ్ కావడంతో మందుబాబులు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవడంలో నిమగ్నమయ్యారు.

## జి.ఓ నెంబర్ 3 ప్రత్యామ్యాయం కల్పించాలి.




- స్పెషల్ డిఎస్సి ప్రకటించాలి గిరిజన అభ్యర్థులను ఆదుకోవాలి.
- ఆదివాసీ గిరిజనసంఘం ఎస్ఎఫ్ఐ యువజన సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్.

**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు,29పెన్ పవర్.** మండల కేంద్రంలో గల ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయంలోశుక్రవారం నాడు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం,ఎస్ఎఫ్ఐ,యువజన సంఘం నాయకులు మాట్లాడుతూ ఎన్నికలు ముందు అరకు బహిరంగ సభలో నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీవో నెంబర్ 3 కు ప్రత్యామ్యాయం తీసుకువస్తామని గిరిజన ప్రాంతంలో ఉన్న నిరుద్యోగ అభ్యర్థులకు రిజర్వేషన్ కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు.కానీ గతంలో ఇచ్చిన 16,347డీఎస్సీలో ఎలాంటి స్పెషల్ డిఎస్సి ప్రకటించకుండా విడుదల చేయడం చాలా బాధాకరం అన్నారు.దీనివల్ల గిరిజన యువత నష్టపోతున్నారని నిరుద్యోగం పెరిగిపోతుందని తక్షణమే జీవో నెంబర్3కి ప్రత్యేమ్యాయం ప్రకటించి పగడబందీగా అమలు చేయాలని.సెప్టెంబర్ 1వ తేదీన జీవో నెంబర్ 3 ప్రత్యామ్యయం చూపాలని,గిరిజన ప్రాంతంలో స్పెషల్ డిఎస్సి ప్రకటించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో జరగబోయే నిరసన కార్యక్రమని విద్యార్థులు,నిరుద్యోగులు గిరిజన సంఘాలు,గిరిజన మేధావులు పాల్గొని జయప్రదంచేయాలనీ కోరారు.కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మండంగి.రమణ,తిరుపతిరా ు,వెంకటరవు,యువజనసంఘం నాయకులు ఏం.సన్యాసి,బి.సత్యంఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్,గంగారావు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నీళ్లలో మోకాళ్ళ మీద నిరసన



- పీఎం జన్మన్ ద్వారా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్
- గ్రామస్తులతో కలిసి నిరసన వ్యక్తం చేసిన వైసిపి మండల అధ్యక్షుడు, పద్మారావు, సీనియర్ నాయకులు వివిఎన్ మూర్తి.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 29.** మండలంలో గల కించాయిపుట్టు పంచాయితి, వర్కుగుమ్మి గ్రామంలో పీఎం జన్మన్ నిధులతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నీళ్లలో మోకాళ్ళ మీద నిలబడి గ్రామస్తులతో కలిసి వైసీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, సీనియర్ నాయకులు జెవివిఎన్ మూర్తి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రిడ్జి లేకపోవడంతో గ్రామంలో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పిఎం జన్మన్ నిధుల ద్వారా తక్షణమే గ్రామంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాకాలంలో వరద ఉధృతితో రాకపోకలు స్తంభించి పోతున్నాయని, నిత్యవసర సరుకులు సైతం దొరకని పరిస్థితి నెలకొందని వైసీపీ నాయకుల ఎదుట గ్రామస్తులు తమ గోడును వినిపించారని వారు తెలిపారు. అంతకుముందు గ్రామంలో పర్యటించిన వైసిపి నేతలకు గ్రామస్తులు పుష్ప గుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. వైసిపి నేతలు గ్రామంలో వినాయక గుడి వద్ద వెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో బ్రిడ్జి నిర్మాణానికి జిల్లా పరిషత్ చైర్పర్సన్ దృష్టికి కూడా తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని గ్రామస్తులతో వైసిపి సీనియర్ నేత జెవివిఎన్ మూర్తి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గొల్లోరి సన్యాసిరావు, కార్యదర్శి చెండా పాపారావు, కృష్ణారావు పాల్గొన్నారు.



# 'సేవ్ టీడీపీ' ఆ నియోజకవర్గంలో మళ్లీ అగ్గి రాజుకుంది!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో అధికార కూటమిలో ప్రధాన భాగస్వామి టీడీపీ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ప్రస్తుతం పార్టీ కార్యవర్గాల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుండగా, పలు చోట్ల వివాదాలు జరుగుతున్నాయి. కార్యకర్తలు ఒకరిని కోరుకుంటే, నేతలు తమకు నచ్చిన వారిని అందలం ఎక్కించాలని చూడటమే వివాదాలకు కారణంగా తెలుస్తోంది. ఇప్పటికే పలు జిల్లాల్లో నాయకత్వాలపై పోరు జరుగుతుండగా, ఈ రోజు అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రంలో స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణికి వ్యతిరేకంగా కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. 'సేవ్ టీడీపీ' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ అగ్గి రాజేశారు.

శింగనమల నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణికి నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న టు మెన్ కమిటీకి తొలి నుంచి విభేదాలు కొనసాగుతున్నాయి. శాసనసభ ఎన్నికల్లో శ్రావణి అభ్యర్థిత్వాన్ని టు మెన్ కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. అయితే అధిష్టానం జోక్యంతో శ్రావణి గెలుపు కోసం టు మెన్ కమిటీ పనిచేసినట్లు కార్యకర్తలు చెబుతున్నారు. ఇక ఎన్నికల ఫలితాలు విడుదలైన మరుక్షణం నుంచి వీరి మధ్య విభేదాలు యథావిధిగా మొదలయ్యాయి. ఎమ్మెల్యే వర్సెస్ టు మెన్ కమిటీ అన్నట్లు పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయింది. దీంతో ఈ నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలు అధిష్టానానికి తలనొప్పిగా మారాయని అంటున్నారు.ప్రతి చిన్న విషయాన్ని రాజకీయ కోణంలో చూడటం, ఆధిపత్యం ప్రదర్శించే అవకాశంగా వాడుకోవడంతో శింగనమల టీడీపీ రాజకీయాలు నిత్యం కాక మీద ఉంటున్నాయి. తాజాగా బుక్కరాయసముద్రం మండలంలో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. వీరి స్థానంలో కొత్తవారిని నియమించాలని ఎమ్మెల్యే శ్రావణి ఆదేశించినట్లు చెబుతున్నారు. దీంతో శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించారు. తమ వర్గానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడంపై టు మెన్ కమిటీ మద్దతుదారులైన టీడీపీ కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అంతేకాకుండా ఎమ్మెల్యే శ్రావణి నుంచి టీడీపీని రక్షించాలని కోరుతూ 'సేవ్ టీడీపీ' నినాదాలు చేస్తూ హోరెత్తించారు.గత ఎన్నికలకు ముందు పట్టుబట్టి ఎమ్మెల్యే టికెట్ సాధించిన బండారు శ్రావణి ప్రతిభావంతురాలిగా అధిష్టానం వద్ద గుర్తింపు తెచ్చుకున్నారు. జిల్లాలో రెండు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలు ఉండగా, ఈ రెండు చోట్ల యువకులైన నేతలే ఎమ్మెల్యేలుగా ఉన్నారు. అయితే శ్రావణితోపాటే ఎమ్మెల్యేగా ఎన్నికైన మడకశిర శాసనసభ్యుడు ఎంఎస్ రాజు తన నియోజకవర్గంలో అందరినీ కలుపుకుని పోతుండగా, శ్రావణి విషయంలో మాత్రం అలా జరగడం లేదు. తొలి నుంచి ఆమె నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న వారు.. ఇప్పుడు ఆమె అధికారం చెలాయించడాన్ని సహించలేకపోతున్నట్లు చెబుతున్నారు. దీంతోనే తరచూ విభేదాలు వస్తున్నాయని శ్రావణి వర్గీయులు ఆరోపిస్తున్నారు.అయితే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక ఆమె తమను కలుపుకుని వెళ్లడం లేదని టు కమిటీకి చెందిన నేతలు, కార్యకర్తలు వాపోతున్నారు. నెల్లూరు పెద్దారెడ్డి వంటి నాయకుడు సలహాలపై అధారపడుతున్న ఎమ్మెల్యే శ్రావణి తమను నిర్లక్ష్యం చేస్తున్నారని, అసలు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. దీంతో శింగనమల రాజకీయం నిత్యం వాడివేడిగా సాగుతోంది. మరోవైపు పరిస్థితులు ఇలానే కొనసాగితే పార్టీ మూల్యం చెల్లించుకోక తప్పదని టీడీపీ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిష్టానం జోక్యం చేసుకుని ఎక్కడో ఒక చోట ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టాలని కోరుతున్నారు.

# పవన్ లెక్క పక్కా...
# వైసీపీకి అధికారం కల ?



**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజకీయ మేథమెటిక్స్ ని బాగా ఔపాసన పట్టారు. ఆయన రాజకీయ వ్యూహాలను కూడా బాగానే ఒడిసిపట్టారు. దాంతోనే వైసీపీకి ఉక్కిరి బిక్కిరి తప్పడం లేదు. 2019లో జరిగిన పొరపాట్లు 2024 నాటికి రిపీట్ కాకుండా పవన్ చూసుకున్నారు ఫలితంగా ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. అదే సమయలో వైసీపీ ఏకంగా 11 సీట్లకు పడిపోయి పాతాళం అంచులను చూసింది. కట్ చేస్తే పవన్ మరింతగా తన వ్యూహాలను పదును పెడుతున్నారు. అది టీడీపీ అధికార ఆశలను కలగా మార్చేసే పరిస్థితి ఉందా అన్నదే ఇపుడు చర్చగా కనిపిస్తోంది.

**టీడీపీతోనే బలమైన బంధం :**
పవన్ 2014లో పార్టీ పెట్టారు అంతకు ముందు ప్రజారాజ్యంలో కొంతకాలం పనిచేశారు. మొత్తంగా చూస్తే కనుక ఆయనకు 15 ఏళ్ళకు మించి రాజకీయ అనుభవం ఉంది. అదే ఇపుడు ఆయన నిర్ణయాలలో కనిపిస్తోంది అని అంటున్నారు. ఏపీలో అధికారం 2014లో టీడీపీ వస్తే 2019లో వైసీపీకి వచ్చింది. 2024లో తిరిగి టీడీపీ కూటమికి వచ్చింది ఈ లెక్కన 2029లో వైసీపీకే అధికారం అని ఆ పార్టీ భావిస్తోంది. కానీ అలా కాదు అని పవన్ పక్కా లెక్కలతో నిరూపించబోతున్నారు. ఆయన టీడీపీతో బలమైన బంధాన్ని పెనవేసుకుంటున్నారు.

**పొత్తుతోనే వైసీపీ చిత్తు :**
ఏపీలో త్రిముఖ పోరు సాగితే వైసీపీకి లాభిస్తుంది. ఎందుకంటే వైసీపీ అయిదేళ్ల పాటు అధికారం చూసింది గ్రౌండ్ లెవెల్ లో విస్తరించి ఉంది అలాగే అనేక సార్లు టీడీపీ అధికారంలో ఉంది. ఆ పార్టీ గ్రాస్ రూట్ లెవెల్ దాకా బలంగా ఉంది ఇలా రెండు బలమైన ప్రాంతీయ పార్టీల మధ్య అధికారం పూర్తిగా దక్కించుకోని జనసేన పోటీకి సొంతంగా దిగితే ఓట్లు చీలి వైసీపీకి అధికారం దఖలు పడుతుంది. అందువల్లనే పవన్ టీడీపీతో పదిహేనేళ్ళ బంధం అని అంటున్నారు. ఆ పార్టీతో కలసి ప్రయాణం చేయాల్సిందే అని శ్రేణులకు కూడా చెబుతున్నారు . కూటమితో ఉండడం అనివార్యం దానికి సిద్ధపడి పార్టీ పనిచేయాల్సి ఉంటుందని దిశా నిర్దేశం చేస్తున్నారు.

**పవన్ సందేశం ఇదే :**
విశాఖ వేదికగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న జనసేన విస్తృత స్థాయి పార్టీ సమావేశాలలో పవన్ క్యాడర్ కి ఇస్తున్న సందేశం ఇదే అని అంటున్నారు. కూటమి అన్నాక కొన్ని ఇబ్బందులు ఉంటాయి. కానీ రాష్ట్ర హితం కోరుకుంటూ సర్దుకుని పోవాలని ఆయన సూచిస్తున్నారు అని అంటున్నారు. జనసేనకు అధికారం పదవుల కంటే కూడా రాష్ట్రం చాలా ముఖ్యమని పవన్ పదే పదే చెబుతున్నారు. ఏపీలో టీడీపీ జనసేన పొత్తు ఏకంగా పదిహేనేళ్ళ పాటు కొనసాగించడానికి సిద్ధమని కూడా ఆయన చెబుతున్నారు. ఈ విధంగా జనసేన శ్రేణులను ఆయన మానసికంగా సిద్ధం చేస్తున్నారని అంటున్నారు.

**వైసీపీకి చిక్కులు తప్పవా :**
ఏపీలో టీడీపీ జనసేన బంధం ఎంత గట్టిగా ఉంటే అంత ఎక్కువగా వైసీపీకి చిక్కులు ఉంటాయి ఆ రెండు పార్టీలు కలిస్తే సహజంగానే వారి ఓటు షేర్ 50 శాతం దాటేస్తుంది. టీడీపీకి నలభై శాతం జనసేనకు పది శాతం కలుపుకుంటే చాలు అధికారం వారి చేతిలోనే ఉంటుంది ఈ మధ్యలో వైసీపీ తన ఓటు షేర్ ని మరో అయిదారు శాతం పెంచుకున్నా అధికారానికి దూరంగానే ఉంటుందని అంటున్నారు. మొత్తం మీద విశాఖ వేదికగా జరుగుతున్న జనసేన సమావేశాల నుంచి వైసీపీకి ఒక చేదు సందేశాన్నే పవన్ వినిపించబోతున్నారు అని అంటున్నారు. ఈ నెల 30న జరిగే బహిరంగ సభలో టీడీపీతో పొత్తుల గురించి ఆయనే మరింత గట్టిగా ప్రకటిస్తారు అని అంటున్నారు.

# నేతాజీ అవశేషాలు: మోడీకి నేతాజీ కుమార్తె భావోద్వేగపూరిత విజ్ఞప్తి

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్వాతంత్ర్య పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ కుమార్తె అనితా బోస్ ప్ఫాఫ్, ప్రధాని నరేంద్ర మోదీకి ఒక భావోద్వేగపూరిత విజ్ఞప్తి చేశారు. తన తండ్రి అవశేషాలను జపాన్‌లోని టోక్యో నుంచి భారతదేశానికి తీసుకురావాలని ఆమె కోరారు. ప్రధాని మోదీ ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న సందర్భంగా ఈ అభ్యర్థన చేశారు.



**నేతాజీ మరణంపై ఉన్న అస్పష్టత:**
1945 ఆగస్టు 18న తైవాన్‌లోని తైపేలో జరిగిన విమాన ప్రమాదంలో నేతాజీ మరణించారని సాధారణంగా నమ్ముతారు. ఆ తర్వాత ఆయన అవశేషాలను జపాన్‌లోని రెంకోజీ బౌద్ధ దేవాలయంలో భద్రపరిచినట్లు చెబుతారు. అయితే, ఈ విమాన ప్రమాదంలో నేతాజీ మరణించలేదని, అది ఒక కుట్ర అని కొందరు చరిత్రకారులు వాదిస్తూ వచ్చారు. ఈ అంశంపై దశాబ్దాలుగా అనేక వివాదాలు, సందేహాలు కొనసాగుతున్నాయి. అనేక కమిషన్లు కూడా నేతాజీ మరణంపై నివేదికలు సమర్పించినప్పటికీ, ఈ విషయంలో స్పష్టత రాలేదు.

**అనితా బోస్ ప్ఫాఫ్ విజ్ఞప్తి**
తన తండ్రి అవశేషాలను తిరిగి భారతదేశానికి తీసుకురావాలని అనితా బోస్ ప్ఫాఫ్ చాలాకాలంగా కోరుతున్నారు. ప్రధాని మోదీ జపాన్ పర్యటన నేపథ్యంలో ఆమె ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని "నా తండ్రి ఈ మట్టి కోసం, ఈ జాతి కోసం తన ప్రాణాలను అర్పించారు. ఆయనకు తగిన గౌరవం ఇవ్వాలంటే అవశేషాలు భారత్‌లో ఉండాలి. దానిని సాధించగల సామర్థ్యం మీకు ఉంది మోదీజీ," అని ప్రధానిని కోరారు.

**ప్రభుత్వ స్పందనపై ఉత్కంఠ**
నేతాజీ వారసులు, కుటుంబ సభ్యులు, అలాగే దేశ ప్రజలు దశాబ్దాలుగా ఆయన అవశేషాలను తిరిగి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఈ విషయంలో వివిధ ప్రభుత్వాలు చొరవ చూపినప్పటికీ స్పష్టమైన పురోగతి లేదు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఈ విజ్ఞప్తిపై ఎలా స్పందిస్తారన్న దానిపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. నేతాజీకి తగిన గౌరవం ఇవ్వడం, దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

# తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి సుప్రీం సపోర్టు.. ఇక తగ్గేదేలే అంటున్న వైసీపీ



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ నేత, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట దక్కింది. 15 నెలలుగా సొంత నియోజకవర్గం తాడిపత్రిలో అడుగుపెట్టలేకపోతున్న పెద్దారెడ్డి ఈ విషయమై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శాంతిభద్రతల పేరుతో తనను తాడిపత్రిలో ఇంటికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని పెద్దారెడ్డి ఆరోపించారు. దీనిపై తొలుత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, పోలీసు భద్రత మధ్య పెద్దారెడ్డిని తాడిపత్రిలో ఆయన ఇంటికి తీసుకువెళ్లాలని సింగిల్ బెంచ్ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అయితే దీనిపై ప్రభుత్వం డివిజన్ బెంచులో సవాల్ చేసింది. శాంతిభద్రతల సమస్యతో డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ న్యాయమూర్తి తీర్పుపై స్టే విధించింది. ఈ తీర్పుపై పెద్దారెడ్డి సుప్రీంకోర్టుకు వెళ్లగా సింగిల్ బెంచ్ న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు అమలు చేయాలని తీర్పు వెలువరించింది.సుప్రీం తీర్పుతో తాడిపత్రి రాజకీయాలు మరోమారు వేడెక్కాయి. ఈ నియోజకవర్గంలో టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి, వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. ఇరువర్గాల వారు గతంలో అనేక సార్లు దాడులు, ప్రతిదాడులకు దిగడంతో తాడిపత్రి రక్తమోడింది. ఎన్నికల సమయంలో పరిస్థితి మరింత దిగజారడంతో జేసీ ప్రభాకర్ రెడ్డిని, సిట్టింగ్ ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని తొలుత తాడిపత్రి నుంచి బహిష్కరించారు. ఎన్నికల అనంతరం జేసీ ప్రభాకర్ రెడ్డి, అస్మిత్ రెడ్డిపై ఆంక్షలు తొలగించారు.ఆ తర్వాత కొద్ది రోజులకు పెద్దారెడ్డిపైనా ప్రభుత్వం ఆంక్షలు తొలగించినా, ఆయన తాడిపత్రిలో అడుగు పెట్టకుండా మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గం అడ్డుకుంటోంది. ఈ నేపథ్యంలో పెద్దారెడ్డి స్వగ్రామం తిమ్మంపల్లి నుంచి తాడిపత్రికి వచ్చేందుకు పలుమార్లు ప్రయత్నించారు. అయితే పోలీసులు మాత్రం అందుకు అంగీకరించలేదు. తాడిపత్రి ఊరు బయటే పెద్దారెడ్డిని ఆపేసి వెనక్కి పంపేవారు. ఈ పరిస్థితుల్లో పోలీసుల తీరును తప్పుపడుతూ పెద్దారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చినా, పోలీసులు మళ్లీ అప్పీలు చేయడంతో పెద్దారెడ్డి తాడిపత్రిలో అడుగు పెట్టలేకపోయారు.ఈ విషయంపై పెద్దారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ అనుకూలంగా తీర్పురావడంతో తాడిపత్రికి వచ్చేందుకు లైన్ క్లియర్ అయినట్లు చెబుతున్నారు. పెద్దారెడ్డి తన ఇంటికి వెళ్లకుండా ఎవరు ఆపుతున్నారని న్యాయస్థానం ప్రశ్నించింది. అదే సమయంలో ఆయన భద్రతకు సంబంధించి అవసరమైన ఖర్చును భరిస్తామని పెద్దారెడ్డి తరఫు న్యాయవాదులు కోర్టుకు చెప్పినట్లు సమాచారం. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం ఆయనకు భద్రత కల్పించాలని ఆదేశాలు విడుదల చేస్తూ విచారణను ముగించినట్లు ప్రకటించింది. దీంతో తాడిపత్రి పాలిటిక్స్ వేడెక్కే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు.

# ఒకే రోజులో 27 కోట్లతో 3 రోల్స్ రాయిస్ కార్లు కొనుగోలు చేసిన వ్యాపారవేత్త

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశ వ్యాపార ప్రపంచంలో కొన్ని సంఘటనలు మాత్రమే ప్రజల దృష్టిని ఆకర్షిస్తాయి. అటువంటి అసాధారణమైన సంఘటనలలో ఒకటిగా... కొల్హాపూర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త.. దాత సంజయ్ ఘొడావత్ ఒకే రోజులో మూడు అత్యంత ఖరీదైన రోల్స్ రాయిస్ లగ్జరీ కార్లను కొనుగోలు చేసి సంచలనం సృష్టించారు. ఈ విషయం ప్రస్తుతం వ్యాపార, ఆటోమొబైల్ వర్గాల్లో విస్తృతంగా చర్చనీయాంశంగా మారింది. ఈ మూడు కార్ల విలువ దాదాపు ?27 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ కొనుగోలు సంజయ్ ఘొడావత్ యొక్క సంపద, వ్యాపార సామ్రాజ్యం.. అతని ప్రత్యేక అభిరుచులకు నిదర్శనం.




**ఘొడావత్: ఒక విజన్ ఉన్న పారిశ్రామికవేత్త**
సంజయ్ ఘొడావత్ కేవలం సంపన్నుడు మాత్రమే కాదు, ఒక విజన్ ఉన్న పారిశ్రామికవేత్తగా ప్రసిద్ధి పొందారు. ఆయన స్థాపించిన ఘొడావత్ గ్రూప్ అనేక రంగాల్లో తమ వ్యాపారాన్ని విస్తరించింది. విమానయానం, రియల్ ఎస్టేట్, విద్య, ఆహారం, ప్యాకేజింగ్, విద్యుత్ ఉత్పత్తి, రసాయనాలు వంటి వివిధ రంగాల్లో ఈ గ్రూప్ కార్యకలాపాలు సాగిస్తోంది. ఆయన నాయకత్వంలో, ఘొడావత్ గ్రూప్ కేవలం దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా తమ సత్తా చాటుతోంది. ముఖ్యంగా ఆయనకు చెందిన స్టార్ ఎయిర్ విమానయాన సంస్థ, దేశంలోని చిన్న, మధ్యతరహా నగరాలకు విమాన సేవలను అందిస్తూ భారతీయ విమానయాన రంగంలో ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఈ సంస్థ ముంబై-కొల్హాపూర్ వంటి కీలక మార్గాల్లో సేవలను అందిస్తూ ప్రయాణికుల మనసులు గెలుచుకుంటోంది.

**లగ్జరీ కార్లపై సంజయ్ ఘొడావత్ ప్రత్యేక ఆసక్తి**
సంజయ్ ఘొడావత్‌కు లగ్జరీ కార్లపై ఉన్న ఆసక్తి అందరికీ తెలిసిందే. ఇప్పటికే ఆయన వద్ద ఎన్నో ఖరీదైన కార్ల సేకరణ ఉంది. ఇందులో ఫెరారీ, లంబోర్ఘిని, మెర్సిడెస్ వంటి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కార్లు ఉన్నాయి. తాజాగా ఒకేరోజు మూడు రోల్స్ రాయిస్ కార్లను తన సేకరణలో చేర్చుకోవడం, ఆటోమొబైల్ ప్రపంచంలో ఒక అరుదైన సంఘటనగా చెప్పవచ్చు. రోల్స్ రాయిస్ కార్లు కేవలం వాహనాలు మాత్రమే కాదు, అవి శైలి, వైభవం.. కీర్తికి చిహ్నాలు. ఈ కార్లు ప్రత్యేకంగా, కొనుగోలుదారుల అభిరుచుల ప్రకారం కస్టమైజ్ చేయబడతాయి. ఘొడావత్ తన సేకరణను విస్తరించడం, ఆయన వ్యాపార విజయానికి, శ్రమకు లభించిన ప్రతిఫలం అని చెప్పవచ్చు.

**వ్యాపారవేత్తగానే కాకుండా ఒక గొప్ప దాత**
ఘొడావత్ కేవలం వ్యాపారంలోనే కాకుండా, సామాజిక సేవలో కూడా ముందుంటారు. సమాజానికి తిరిగి సేవ చేయాలన్న తన నిబద్ధతతో, ఆయన పలు దాతృత్వ కార్యక్రమాలను చేపట్టారు. ఆయన స్థాపించిన విద్యా సంస్థలు, వైద్య కేంద్రాలు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలు సమాజంలో గణనీయమైన మార్పు తీసుకువస్తున్నాయి. ముఖ్యంగా విద్యారంగంలో, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఆయన కృషి ఎంతో ప్రశంసనీయం. ఈ కార్యక్రమాల ద్వారా ఆయన కేవలం సంపన్నుడుగానే కాకుండా, ఒక బాధ్యత గల పౌరుడిగా, దాతగా ప్రజల మనస్సుల్లో నిలిచిపోయారు. ఈ విధంగా సంజయ్ ఘొడావత్ తన వ్యాపార నైపుణ్యంతో పాటు, సామాజిక స్పృహతో అందరికీ స్ఫూర్తినిస్తున్నారు.

ఒకే రోజులో మూడు రోల్స్ రాయిస్ కార్లను కొనుగోలు చేసిన సంజయ్ ఘొడావత్ కథ, భారతదేశంలో వ్యాపార ప్రపంచం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో తెలియజేస్తుంది. ఈ సంఘటన, ఆయన కృషి, పట్టుదల.. వ్యాపార విజయాన్ని సూచిస్తుంది. అయితే, ఆయన తన సంపదను సమాజ సంక్షేమం కోసం కూడా ఉపయోగిస్తున్నారనేది మరింత గొప్ప విషయం.

# జగన్ కోసం సీబీఐ గొంతునొక్కేస్తారా? ఏపీసీసీ చీఫ్ షర్మిల సంచలన ఆరోపణలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన సోదరుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డిపై మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన చిన్నాన్న మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో న్యాయం కోసం తాము ఇంకా ఎన్నాళ్లు పోరాడాలని ప్రశ్నించారు. వివేకా కుమార్తె సునీత పోరాటంలో న్యాయం ఉందని వ్యాఖ్యానించిన షర్మిల.. ఈ కేసులో జగన్ కోసం ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థ సీబీఐ గొంతు నొక్కేస్తోందని ఆరోపించారు. వివేకా కేసును పునర్విచారించాలని డిమాండ్ చేసిన షర్మిల, అసలు దోషులను గుర్తించకుండా దర్యాప్తు ముగిసిందని సీబీఐ ప్రకటించడంపై మండిపడ్డారు.వివేకానంద రెడ్డి హత్య కేసుపై విజయవాడలో మీడియాతో షర్మిల మాట్లాడారు. వివేకా హత్య విషయంలో మళ్లీ దర్యాప్తు చేపట్టకపోవడాన్ని నిలదీశారు. వై నాట్ అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన షర్మిల.. ఆరేళ్లుగా పోరాటం చేస్తున్నా న్యాయం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసులో నిందితుడు, కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డిని రక్షించేందుకు జగన్ అడ్డుపడుతున్నాడని షర్మిల ఆరోపించారు. హత్య జరిగిన సమయంలో అవినాశ్ రెడ్డి అక్కడే ఉన్నట్లు గూగుల్ మ్యాప్



లొకేషన్లు ఉన్నాయని షర్మిల ఆరోపించారు.జగన్ ప్రధాని మోదీకి దత్తపుత్రుడు, ప్రధాని మోదీ చేతిలో సీబీఐ కీలుబొమ్మ. జగన్ కోసం సీబీఐ గొంతునొక్కారంటూ షర్మిల తీవ్ర ఆరోపణలు చేశారు. జగన్ కోసమే నిందితుడు అవినాశ్ రెడ్డిని కాపాడుతున్నారని ఆమె వ్యాఖ్యానించారు. నిజంగా సీబీఐ అనుకుంటే దోషులకు ఎపుడో శిక్ష పడేదని చెప్పారు. వివేకా హత్య కేసులో అన్ని ఆధారాలు ఉన్నాయని.. గూగుల్ మ్యాప్ లొకేషన్లు కూడా ఉన్నాయని షర్మిల పేర్కొన్నారు. వైఎస్ వివేకా హత్య జరిగినప్పుడు అవినాష్ రెడ్డి సంఘటనా స్థలంలో ఉన్నాడని.. ఇందుకు సంబంధించి సాక్ష్యాధారాలు కూడా ఉన్నాయని షర్మిల తెలిపారు. ఇన్ని ఆధారాలు ఉన్నప్పటికీ.. న్యాయం ఎందుకు జరుగడం లేదని ప్రశ్నించారామె. సీబీఐ విచారణ సరిగా లేదంటూ సునీత చేసిన ఆరోపణలు నిజముందన్నారు.షర్మిల వ్యాఖ్యలతో వివేకా హత్య కేసు మరోమారు చర్చనీయాం శమైంది. ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం కూడా చాలా సీరియస్ గా ఉందని అంటున్నారు. కడప జైల్లో అప్రూవర్ దస్తగిరిని బెది రించిన కేసుపై తాజాగా విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభు త్వం తన వైపు నుంచి వివేకాకు న్యాయం చేయడానికి పావులు కదుపుతోందని అంటున్నారు. నిందితుల్లో ఒకరైన వైసీపీ నేత శివశంకర్ రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి మెడికల్ క్యాంపు పేరిట జైలుకు వెళ్లి దస్తగిరిని బెదిరించినట్లు కేసు నమోదైంది. దీనిపై తాజాగా నిజానిజాలు నిగ్గుతేల్చాలని ప్రభుత్వం పావులు కదుపు తోంది. మరోవైపు గత ప్రభుత్వంలో సాక్షులను బెదిరిస్తున్నారనే ఆరోపణలతో వైఎస్ సునీత దంపతులతోపాటు, సీబీఐ ఎస్పీ రాంసింగ్ పై పోలీసు కేసులు దీన్ని ఇటీవలే సుప్రీంకోర్టు కొట్టివేసింది. అదే సందర్భంలో హత్య కేసును త్వరలో తేల్చేస్తామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో షర్మిల బయటకు వచ్చి చిన్నాన్న హత్యలో తమకు న్యాయం జరగడం లేదని, సొంత సోదరుడిపైనే విమర్శలు చేయడం గమనార్హం.

# ఆస్ట్రేలియా టూరే చివరిదా?..
# రోహిత్, కోహ్లీ భవిష్యత్తుపై ఆసక్తికర చర్చ

**రోహిత్, కోహ్లీల వన్డే భవిష్యత్తుపై మాజీ వికెట్ కీపర్ విజయ్ దహియా వ్యాఖ్యలు**

**రిటైర్మెంట్‌పై వారే తుది నిర్ణయం తీసుకోవాలన్న దహియా**

**నిర్ణయంలో టీమ్ మేనేజ్‌మెంట్‌కూ కీలక పాత్ర ఉంటుందని వెల్లడి**

**వారి సేవలను గౌరవించాలని, వారి ఆటను ఆస్వాదించాలని సూచన**

**ఆస్ట్రేలియా పర్యటనే వారికి చివరి వన్డే సిరీస్ కావొచ్చని ఊహాగానాలు**




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వన్డే ఫార్మాట్ నుంచి కూడా రిటైర్ అవుతారనే ప్రచారం జోరుగా సాగుతున్న నేపథ్యంలో భారత మాజీ వికెట్ కీపర్ విజయ్ దహియా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే ప్రపంచకప్ వరకు వారు ఆడాలా? వద్దా? అనే తుది నిర్ణయం పూర్తిగా వారికే వదిలేయాలని, ఆ హక్కు వారికి ఉందని దహియా అభిప్రాయపడ్డాడు. భారత క్రికెట్‌కు వారు అందించిన అపారమైన సేవలను దృష్టిలో ఉంచుకుని, ఈ విషయంలో వారికే పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని ఆయన స్పష్టం చేశాడు. అయితే, ఈ విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్, సెలెక్టర్ల పాత్ర కూడా కీలకంగా ఉంటుందని దహియా అంగీకరించాడు. "కొన్నిసార్లు మనం ఈ దిగ్గజ ఆటగాళ్లను గౌరవించడం మర్చిపోతాం. వారు ఆడుతున్నంత కాలం భారత క్రికెట్‌కు చేసిన సేవలను గుర్తించి, వారిని గౌరవించుకోవాలి. ఎప్పుడో ఒకప్పుడు అందరూ క్రికెట్‌ను వీడాల్సిందే. కానీ వారు అందించిన విజయాలను మనం ఆస్వాదించాలి" అని ఆయన 'స్పోర్ట్స్‌యారీ'తో అన్నాడు. "ఆటపై ప్రేరణ, ఫిట్‌నెస్ అనేవి ఆటగాళ్ల వ్యక్తిగత విషయం. వారి తరఫున ఇతరులు నిర్ణయం తీసుకోవాలని చూస్తుంటారు. కానీ ఇది వారి వ్యక్తిగత నిర్ణయం. వారు దేశానికి అందించిన సేవలను బట్టి చూస్తే, ఏం చేయాలో, ఏం చేయకూడదో వారికి ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు" అని దహియా తేల్చిచెప్పాడు. ఇప్పటికే టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన ఈ ఇద్దరూ, అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాతో జరిగే మూడు వన్డేల సిరీస్‌తో ఈ ఫార్మాట్‌కు కూడా గుడ్‌బై చెప్పవచ్చని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే.

ఈ సందర్భంగా రోహిత్ శర్మ, ఎంఎస్ ధోనీ కెప్టెన్సీల మధ్య పోలికలు తేవడాన్ని దహియా తప్పుబట్టాడు. "ఇద్దరూ భిన్నమైన నాయకులు, ఇద్దరూ తమ జట్లకు ట్రోఫీలు గెలిచిపెట్టారు. రోహిత్ దూకుడు శైలి ప్రత్యేకం, ధోనీ ప్రశాంతత విలక్షణమైనది. వారిద్దరినీ పోల్చడం సరికాదు" అని ఆయన వివరించాడు.

# 2027 వన్డే వరల్డ్ కప్‌లో కోహ్లీ, రోహిత్ ఆడాలంటే..: ఇర్ఫాన్ పఠాన్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమ్ఇండియా దిగ్గజ క్రికెటర్లు రోహిత్ శర్మ విరాట్ కోహ్లీ ఇప్పటికే టీ20, టెస్ట్ క్రికెట్‌కు తమ రిటైర్మెంట్ ప్రకటించారు. ప్రస్తుతం వారిద్దరూ వన్డే ఫార్మాట్‌లోనే కొనసాగుతున్నారు. వీరు చివరిసారిగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్ఇండియా తరఫున ఆడుతూ కనిపించారు. తిరిగి వీరు అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాతో ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్‌లో పాల్గొననున్నారు. ఈ మేరకు రో–కో ద్వయం ఇప్పటికే తమ ప్రాక్టీస్ ప్రారంభించారు. ఈ మూడు వన్డే మ్యాచ్‌ల్లో ప్రదర్శనను బట్టే వీరి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని పలువురు క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే 2027 వన్డే వరల్డ్ కప్‌లో వారు టీమ్ఇండియా స్క్వాడ్‌లో భాగమవుతారా? కారా? అన్న విషయంలో ఇప్పటికైతే క్లారిటీ లేదు. అప్పటికి రోహిత్ శర్మకు 40, విరాట్ కోహ్లీకి 39 సంవత్సరాలు వస్తాయి. అలాంటి పరిస్థితుల్లో వారు వరల్డ్ కప్‌లో కనిపించడం కాస్త కష్టమనే వాదనలూ వినిపిస్తున్నాయి. అప్పటి వరకు రెగ్యులర్‌గా క్రికెట్ ఆడుతూ, ఫిట్‌నెస్ కాపాడుకోవడమే వీరిద్దరికీ సవాల్. వన్డే మ్యాచ్‌ల సంఖ్య తగ్గిపోయిన ప్రస్తుత కాలంలో ఇది నిజంగా వారికి కత్తిమీద సామే. అయితే వారు తమ ఫామ్, ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటే.. రో–కో ద్వయాన్ని పక్కనపెట్టే సాహసం సెలక్టర్లు చేయకపోవచ్చు. ఇదే విషయమై టీమ్ఇండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. 'ఫిట్‌గా ఉంటూ, రెగ్యులర్ క్రికెట్ ఆడటం కొనసాగించడమే విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ముందున్న అతిపెద్ద సవాల్. అప్పుడు మాత్రమే వారు 2027 వన్డే వరల్డ్ కప్ ఆడగలరు. ప్రస్తుతం వారు ఐపీఎల్, ఇంకా ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడగలరు. అయితే అది తాము కొత్తగా ఏదైనా సాధించడం కోసం మాత్రం కాదు. కేవలం రిథమ్ కాపాడుకోవడానికి మాత్రమే. ఇప్పుడు వన్డేల స్థానాన్ని టీ20లు ఆక్రమించాయి. వన్డేల సంఖ్య తగ్గి, టీ20ల సంఖ్య పెరిగింది. ఒక వేళ వీరిద్దరూ ఫామ్, ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటే వన్డే వరల్డ్ కప్‌లో వారు ఆడటం కష్టం కాదు. కానీ దురదృష్టవశాత్తూ వారి మీద ఒత్తిడి ఉంది' అని ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు.

# నిరూపించుకోవడానికి ఏమీలేదు.. అదే నా విజయ సూత్రం: పీవీ సింధు







**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో తెలుగుతేజం పీవీ సింధు అదరగొట్టింది. వరల్డ్ నంబర్ 2 ప్లేయర్ వాంగ్ యును చిత్తు చేసింది. 2019లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన సింధు మళ్లీ అదే ఫామ్‌తో ఈసారి అడుగు పెట్టింది. గాయాలు ఎదురైనా 'ఫిట్‌నెస్'ను కాపాడుకుని ఈ టోర్నీలో ప్రవేశించింది. భారీ వేదికపై రిథమ్‌ను అందుకోవడానికి పడిన శ్రమకు ప్రతిఫలం దక్కినట్లు సింధు వెల్లడించింది. ఇప్పుడు రెండో ర్యాంకర్‌పై విజయం సాధించడంపై స్పందించింది.

"నేను నిరూపించుకోవడానికి పెద్దగా ఏమీలేదు. నా సత్తా ఏంటో ఇప్పటికే వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో నిరూపించా. ప్రత్యేకంగా ఎవరి కోసమో ఆడాల్సిన అవసరం లేదు. విజేతగా నిలవడంపైనే దృష్టిపెట్టా. అయితే, గత రెండేళ్ల నుంచి నా ఆరంభం గొప్పగా లేదు. కెరీర్‌లో చాలా ఒడిదొడుకులు ఎదుర్కొన్నా. గాయపడటం కూడా ఇబ్బందిగా మారింది. గెలవాలని తీవ్రంగా ప్రయత్నించినా సాధ్యపడలేదు. కానీ, ఫిట్‌నెస్‌పై మరింత దృష్టిసారించి మళ్లీ నూతన ఉత్సాహంతో అడుగు పెట్టా. కేవలం ప్రపంచ ఛాంపియన్‌షిప్ కోసం చాలా కష్టపడ్డా. ప్రతి టోర్నీ ముగిసిన తర్వాత.. నేను చేసిన పొరపాట్లు ఏంటో కోచ్‌తో కలిసి చర్చిస్తుంటా. మరోసారి తప్పిదం చేయకుండా ఉండేందుకు ప్రయత్నిస్తా. ఇప్పుడు ఈ టోర్నీలో దాని ఫలితం కనిపిస్తోంది" అని సింధు వెల్లడించింది. క్వార్టర్ ఫైనల్‌లో ఇండోనేషియాకు చెందిన పీకే వార్దనితో పీవీ సింధు ఇవాళ తలపడనుంది. ప్రస్తుతం వార్దని ప్రపంచ మహిళా బ్యాడ్మింటన్ విభాగంలో తొమ్మిదో ర్యాంకులో ఉంది. మరోవైపు పీవీ సింధు 15వ స్థానంలో కొనసాగుతోంది. నాకౌట్ దశలో టాప్ ర్యాంకర్లతో సింధు పోటీ పడాల్సి ఉంది. సెమీస్‌లోనూ కఠిన ప్రత్యర్థి తప్పదు. అయితే, ప్రపంచ రెండో ర్యాంకర్‌పైనే గెలిచిన సింధు మిగతా ప్లేయర్లపై ఆధిపత్యం ప్రదర్శించడం పెద్ద కష్టమేం కాదనేది క్రీడా విశ్లేషకుల అంచనా.



పూజా హెగ్డే టుట్టి ఫ్రూటీ క్యూటీ

# రాజా సాబ్ మీదే ఆ ఇద్దరి హోప్స్..?

రెబల్ స్టార్ ప్రభాస్ రాజా సాబ్ సినిమాను మారుతి చాలా పెద్ద ప్లానింగ్ తోనే చేస్తున్నాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో వస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్ గా నటించింది. సినిమా టీజర్ లోనే ఈ ఇద్దరి పాత్రలను ఇంట్రడ్యూస్ చేశాడు మారుతి. సో తప్పకుండా ఈ ఇద్దరికి సినిమాలో మంచి రోల్స్ పడినట్టు ఉన్నాయి. రెబల్ స్టార్ ప్రభాస్ తో ఛాన్స్ కాబట్టి కచ్చితంగా ఈ ఇద్దరికి మంచి ఛాన్స్ ఉంటుంది.

**రాజా సాబ్ తోనే అమ్మడు హిట్ టార్గెట్..**



ఐతే నిధి అగర్వాల్ విషయానికి వస్తే ఈమధ్యనే హరి హర వీరమల్లు సినిమాతో వచ్చింది. ఆ సినిమాలో తన రోల్ లెంగ్త్ ఎలా ఉన్నా ఉన్నంతలో ఓకే అనిపించింది. ఐతే రాజా సాబ్ తోనే అమ్మడు హిట్ టార్గెట్ పెట్టుకుంది. హరి హర వీరమల్లు ప్రమోషన్స్ టైం లో నిధి చాలా కష్టపడింది. మరి ప్రభాస్ రాజా సాబ్ కోసం కూడా అదే తరహాలో ప్రమోషన్స్ చేస్తుందా లేదా అన్నది చూడాలి. ఐతే ప్రభాస్ రాజా సాబ్ తో హిట్ ట్రాక్ ఎక్కాలని చూస్తుంది అమ్మడు. ఇక మలయాళ భామ మాళవిక మోహనన్ ని చూస్తే.. ఇప్పటికే తమిళ్, మలయాళ భాషల్లో సినిమాలు చేస్తుంది అమ్మడు. ఐతే తెలుగులో తనకు ఇదే తొలి సినిమా.. ఈ సినిమాతో అమ్మడు తెలుగు ఆడియన్స్ ని మెప్పించాలని చూస్తుంది. సినిమాలే కాదు ఫోటో షూట్స్ తో కూడా మెప్పిస్తున్న మాళవిక మోహనన్ రాజా సాబ్ హిట్ పడితే మాత్రం తెలుగులో మరిన్ని ఛాన్స్ లు రాబట్టుకుంటుంది.

**మ్యూజిక్ కూడా సంథింగ్ స్పెషల్..**

నిధి అగర్వాల్, మాళవిక ఈ ఇద్దరు కూడా రాజా సాబ్ తో తమ లక్ టెస్ట్ చేసుకోవాలని చూస్తున్నారు. ఈ ఇద్దరు అందాల భామలు కూడా ఈ సినిమా మీదే హోప్స్ పెట్టుకున్నారు. మరి మారుతి ఈ ఇద్దరిని ఎలా ప్లాన్ చేశాడో చూడాలి. రాజా సాబ్ సినిమా నిన్నటిదాకా డిసెంబర్ 5కి రిలీజ్ అని చెప్పగా లేటెస్ట్ గా సినిమాను సంక్రాంతి బరిలో దించుతున్నట్టు అనౌన్స్ చేశారు మేకర్స్. రాజా సాబ్ సినిమాకు థమన్ ఇస్తున్న మ్యూజిక్ కూడా సంథింగ్ స్పెషల్ గా ఉండబోతుంది. తప్పకుండా ఈ మూవీపై థమన్ కూడా తన మార్క్ సెట్ చేస్తాడని చెప్పొచ్చు. రాజా సాబ్ సినిమా 2026 సంక్రాంతికి మెగాస్టార్ మన శంకర వరప్రసాద్ తో పాటుగా మరో రెండు సినిమాలతో పోటీ పడుతుంది.



సంప్రదాయం లో వైష్ణవి చైతన్య దయ

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com